
విలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక



హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 354 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | జూలై 2025 | వెల : రూ 10/-



## గ్రూప్‌వన్‌లో అవకతవకల పై పిటిషన్లు

- ఎలాంటి అవకతవకలు లేవన్న టీజీపీఎస్సీ
- వాదనలు విని విచారాణను నేటికి వాయిదా వేసిన హైకోర్టు


హైదరాబాద్-ప్రజా స్వేచ్ఛ

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-1 పిటిషన్లపై విచారణను హైకోర్టు శుక్రవారానికి వాయిదా వేసింది. తెలుగు మీడియం అభ్యర్థులకు సరైన మార్కులు వేయలేదని పలువురు దాఖలు చేసిన పిటిషన్‌పై ఉన్నత న్యాయస్థానం విచారణ జరిపింది. ఈ సందర్భంగా టీజీపీఎస్సీ తరపున సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. పరీక్ష రాసిన అభ్యర్థుల సంఖ్య విషయంలో ఎలాంటి తేడా లేదన్నారు. నామినల్ రోల్స్, అభ్యర్థుల వేలిముద్రల ఆధారంగా పూర్తి వివరాలు వెల్లడించినట్లు చెప్పారు. కోఠిలోని ఓ కేంద్రంలో పరీక్ష రాసిన వారే ఎక్కువ మంది ఎంపికయ్యారనేది అవాస్తవం. -మిగతా 3 లో




# పెట్టుబడులకు సర్కారు అండ

### పెట్టుబడుల ఆకర్షణలో ముందున్న తెలంగాణ



- అభివృద్ధికి కేంద్రంగా హైదరాబాద్ నగరం
- దేశానికి ఫ్యూచర్ సిటీని అందించబోతున్నాం
- ప్రపంచ నగరాలతోనే తమ పోటీ ఉంటుంది
- డిసెంబర్ 9న విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ
- మలబార్ గోల్డ్ తయారీ యూనిట్ ప్రారంభంలో సీఎం రేవంత్

రంగారెడ్డి,ప్రజా స్వేచ్ఛ

హైదరాబాద్‌ను ప్రపంచ పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం మహేశ్వరంలో మలబార్ జెమ్స్ అండ్ జ్యువెలరీ తయారీ యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మహేశ్వరంలో మలబార్ తయారీ యూనిట్ ఏర్పాటు -మిగతా 3 లో



## ప్రారంభమైన అమర్‌నాథ్ యాత్ర

- కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు

శ్రీనగర్

కశ్మీర్ హిమాలయ పర్వతాల్లో మంచులింగం రూపంలో కొలువైన శివుడ్ని భక్తులు దర్శించుకునేందుకు కట్టుదిట్టమైన భద్రత మధ్య అమర్‌నాథ్ యాత్ర ప్రారంభమైంది. యాత్ర మారాల్లో గగనతలంపై నుంచి కూడా పర్యవేక్షణ సాగుతోంది. 38 రోజుల పాటు సాగే ఈ యాత్ర ఆగస్టు 9 నాటికి పూర్తవుతుంది.3880 మీటర్ల ఎత్తులో ఉండే గుహలో ఉన్న ఈ క్షేత్రానికి గురువారం మొదటి బ్యాచ్ భక్తులు బల్తాల్, నున్‌వాన్ శిబిరాల నుంచి బయలుదేరారు.అనంతనాగ్ లోని పహల్గాం లో నున్‌వాల్ శిబిరం నుంచి 48 -మిగతా 3 లో



## అనారోగ్యంతో బాధపడుతున్న కేసీఆర్

- చికిత్స కోసం యశోదాలో చేరిక

హైదరాబాద్ ,

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో గురువారం ఆయన సోమాజిగూడలోని యశోదా ఆసుపత్రిలో చేరారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించారు. గత కొద్ది రోజులుగా కెసిఆర్ సీజనల్ జ్వరంతో బాధపడుతున్నట్లు సమాచారం. అయితే గురువారం ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్ నుంచి నగరంలో -మిగతా 3 లో

## పదేళ్లపాటు బీసీలు యాదికి లేరా

- ఎమ్మెల్సీ కవితకు మహేష్ గౌడ్ చురకలు



హైదరాబాద్, ప్రజా స్వేచ్ఛ

ఎమ్మెల్సి కవిత ఎఐసిసి అధ్యక్షుడు ఖర్గేకు లేఖ రాసింది బిఆర్ఎస్ నేతగానా? జాగృతి నాయకురాలిగానా? అని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. బిసిల కోసం కవిత ఉద్యమం ఎక్కడ చేసిందని అన్నారు. పదేళ్ల పాటు బిసిలు గుర్తుకు రాలేదా అంటూ కవితకు మహేష్ కుమార్ గౌడ్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణలో బిసి బిల్లు చేసేటప్పుడు కవిత జైల్లో ఊచలు లెక్కపెడుతోందని విమర్శించారు. కవిత ఇప్పటిదాకా బిసిల కోసం ఒక్క మాట మాట్లాడిందా? అని అన్నారు. -మిగతా 3 లో


## ప్రధాని మోడీకి ఘనా అత్యున్నత పురస్కారం

- రాబోయే ఐదేళ్లలో భారత్-ఘనాల మధ్య రెట్టింపు వాణిజ్యం
- ఘనంగా స్వాగతించిన ఘనా అధ్యక్షుడు... పార్లమెంటులో ప్రసంగం
- భారతదేశంలో 2,500 కంటే ఎక్కువ రాజకీయ పార్టీలు ఉన్నట్లు ప్రకటన
- ఆశ్చర్య పోయిన పార్లమెంట్ సభ్యులు



న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ

భారాత ప్రధానికి ఘనమైన స్వాగతం, సత్కారం లభించాయి. ఘనా అత్యున్నత పురస్కారం కూడా ప్రదానం చేసింది. రాబోయే ఐదేళ్లలో భారత్- ఘనా దేశాలు వాణిజ్యాన్ని రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఘనాకు భారతదేశం కేవలం భాగస్వామి మాత్రమే కాదని.. ఇరుదేశాలు కలిసి జోడీగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయని తెలిపారు. భారత కంపెనీలు ఘనాలో దాదాపు 900 ప్రాజెక్టులలో రెండు బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెట్టాయని మోదీ చెప్పుకొచ్చారు. ఐదు రోజుల పర్యటనలో భాగంగా పశ్చిమ ఆఫ్రికాలోని ఘనా దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా -మిగతా 3 లో



## చిత్రాల పైరసీతో భారీ బిజినెస్

కేటుగాడిని అరెస్ట్ చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు

హైదరాబాద్,ప్రజా స్వేచ్ఛ

టాలీవుడ్‌లో విడుదలైన పలు భారీ చిత్రాలను పైరసీ చేసి.. వాటి ద్వారా భారీగా నగదు దండుకుంటున్న కిరణ్ కుమార్‌ను సైబర్‌క్రైమ్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి భారీగా పైరసీ సినిమా ఫైల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కిరణ్ కుమార్‌ను సైబర్‌క్రైమ్ -మిగతా 3 లో



## రాహుల్ గాంధీ తెలంగాణ ప్రజలకు తీరని ద్రోహం చేశారు

- హామీలను నెరవేర్చాలని ఏ రోజు మోడీ ప్రభుత్వాన్ని రాహుల్ నిలదీయలేదు
- బీజేపీతో రాహుల్ గాంధీ కలిసి పనిచేస్తున్నారు
- బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ గురించి కేంద్రాన్ని రాహుల్ ఎందుకు నిలదీయడం లేదో
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్-ప్రజా స్వేచ్ఛ

లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా ఏడాది పూర్తి చేసుకుంటున్న రాహుల్ గాంధీ తెలంగాణ ప్రజలకు తీరని ద్రోహం చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. 2014 విభజన చట్టంలోని హామీలను నెరవేర్చాలని ఏ రోజు మోడీ ప్రభుత్వాన్ని రాహుల్ నిలదీయలేదు అని కేటీఆర్ గుర్తు చేశారు. ఎంత పెరిగినా గొర్రెకు బెత్తడే తోక అన్నట్టు ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ సాధించింది ఏం లేదన్నారు కేటీఆర్. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా ఏడాది పూర్తి చేసుకుంటున్న రాహుల్.. తెలంగాణ సమస్యలు, ఈ ప్రాంతానికి హక్కుగా రావాల్సిన అంశాల మీద ఏ రోజు కూడా మాట్లాడలేదన్నారు. -మిగతా 3 లో



## 5న బీజేపీ అధ్యక్షుడిగా రామచంద్రరావు బాధ్యతలు

- 10 గంటలకు బీజేపీ కార్యాలయంలో అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించే అవకాశం

హైదరాబాద్ ప్రజా స్వేచ్ఛ

తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన రామచంద్రరావు శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించబోతున్నారు. శనివారం నాడు అసెంబ్లీకి ఎదురుగా ఉన్న గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్థూపానికి నివాళి అర్పించి.. ఉదయం 10 గంటలకు బీజేపీ కార్యాలయంలో అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. అనంతరం చార్మినార్ దగ్గర ఉన్న -మిగతా 3 లో

# హమాస్‌ను పూర్తిగా తుడిచిపెట్టేస్తాం

– ఇజ్రాయెల్ ప్రధాని



న్యూఢిల్లీ–ప్రజా స్వేచ్ఛ

గాజా లో 60 రోజుల పాటు కాల్పుల విరమణ పాటించేందుకు ఇజ్రాయెల్ అంగీకరించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. ట్రంప్ ప్రకటన వేళ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ కీలక వ్యాఖ్యలు చేశారు. హమాస్ ను పూర్తిగా తుడిచిపెట్టేస్తామని వ్యాఖ్యానించారు. 'హమాస్ ఉండదు.. హమస్థాన్ ఉండదు. ఆ సంస్థను పూర్తిగా తుడిచిపెట్టేస్తాం' అని వ్యాఖ్యానించారు. గాజా అంశంలో తమ ప్రతినిధులు ఇజ్రాయెల్‌తో సుదీర్ఘ చర్చలు చేపట్టారని అధ్యక్షుడు ట్రంప్ తెలిపిన విషయం తెలిసిందే. గాజాలో 60 రోజుల కాల్పుల విరమణకు ఇజ్రాయెల్ అంగీకరించిందని, ఆ సమయంలో అన్ని పార్టీలతో కలిసి యుద్ధాన్ని ఆపేందుకు ప్రయత్నిస్తామన్నారు. శాంతి ఒప్పందం కోసం ఖతార్, ఈజిప్ట్ తీవ్రంగా ప్రయత్నించాయని, వాళ్లే దీనికి సంబంధించిన తుది ప్రతిపాదన చేస్తారన్నారు. మిడిల్‌ఈస్ట్ మంచి కోసం హమాస్ ఆ ఒప్పందాన్ని అంగీకరిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. అయితే, గాజాపై యుద్ధాన్ని పూర్తిగా ఆపేస్తామంటేనే ఒప్పందాన్ని అంగీకరిస్తామని హమాస్ సంస్థ తెలిపింది.

# బీహార్‌లో ఒంటరిగానే పోటీ చేస్తాం




న్యూఢిల్లీ –ప్రజా స్వేచ్ఛ

త్వరలో బీహార్ రాష్ట్రంలో ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆమ్ ఆద్మీ పార్టీ ఎన్నికల్లో పోటీపై సంచలన నిర్ణయం తీసుకుంది. గతంలో పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసినట్లు.. ఈ సారి బీహార్‌లో కూడా ఒంటరిగా పోటీ చేయనున్నట్లు ప్రకటించింది. పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమిలో ఉన్న ఆప్.. అసెంబ్లీ ఎన్నికలు వచ్చేసరికి వింత వైఖరిని కనబరుస్తుంది. కాగా బీహార్ అసెంబ్లీ ఎన్నికలు 2025 అక్టోబర్, నవంబర్‌లో నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు కసరత్తు చేస్తున్నారు. మొత్తం 243 నియోజకవర్గాలకు ఎన్నికలు రెండు, మూడు దశల్లో నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ప్రారంభం అయింది. అయితే భారత దేశ చరిత్రలో మొదటి సారి.. ఎన్నికల సంఘం బీహార్‌లో మొబైల్ యాప్ ద్వారా ఓటింగ్ సౌకర్యాన్ని పరీక్షించనుంది. ఇటీవల జరిగిన ఉపఎన్నికల్లో గుజరాత్, పంజాబ్ ల్లో ఆ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు.

# ఆ దీవుల్లో హై అలర్ట్

2 వారాల్లో 900 సార్లు కంపించిన భూమి..




టోక్యో –ప్రజా స్వేచ్ఛ

దక్షిణ జపాన్‌లో ఉన్న టోకారా దీవుల్లో తీవ్ర స్థాయిలో భూ ప్రకంపనలు చోటుచేసుకుంటున్నాయి. గత రెండు వారాల్లోనే ఆ దీవుల్లో సుమారు 900 సార్లు భూమి కంపించింది. దీంతో స్థానికులు రాత్రిపూట నిద్ర లేకుండా గడుపుతున్నారు. జూన్ 21వ తేదీ నుంచి టోకారా దీవుల్లో సెసిమిక్ యాక్టివిటీ చాలా యాక్టివ్‌గా మారినట్లు అధికారులు చెప్పారు. బుధవారం అక్కడ 5.5 తీవ్రతతో భూకంపం వచ్చింది. ప్రస్తుతం అక్కడ ఎటువంటి నష్టం జరగలేదు. సునామీ వార్నింగ్ కూడా ప్రభుత్వం ఇవ్వలేదు. ఒకవేళ అవసరం అయితే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లవచ్చు అని ప్రభుత్వం పేర్కొన్నది. భూ ప్రకంపనలు ఎక్కువ కావడం వల్ల నిద్ర పట్టడం లేదని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్ రేఖాంశంలో ఉన్న జపాన్‌లో సాధారణంగా భూకంపాలు తీవ్ర స్థాయిలో వస్తుంటాయి. ఆ దేశంలో ప్రతి ఏడాది 1500 భూ ప్రకంపనలు వస్తుంటాయి. టొకారాలో 12 దీవులు ఉన్నాయి. వాటిల్లో సుమారు 700 మంది జీవిస్తున్నారు. ఈ దీవుల్లో ఆస్పత్రులు ఉండవు. ఎమర్జెన్సీ అయితే సమీపంలో ఉన్న కగోషిమా దీవికి వెళ్తారు.

# వచ్చే రెండు వారాల్లో భారత్‌కు ఆరు అపాచీ అటాక్ హెలికాప్టర్లు

న్యూఢిల్లీ –ప్రజా స్వేచ్ఛ



గత కొంతకాలంగా ఎదురుచూస్తున్న అపాచీ అటాక్ హెలికాప్టర్లను వచ్చే రెండు వారాల్లో పంపిణీ చేయనున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. అమెరికా నుండి మూడు అపాచీ ఎహెచ్–64ఇ దాడి హెలికాప్టర్ల మొదటి బ్యాచ్ జుల్ 15నాటికి భారత్‌కు రానున్నాయని రక్షణ శాఖకు చెందిన ఉన్నతాధికారి ఒకరు స్పష్టం చేశారు. తదుపరి బ్యాచ్ అయిన మూడు హెలికాప్టర్లు నవంబర్ నాటికి డెలివరీ కానున్నాయని అన్నారు. 2020లో అమెరికాతో కుదుర్చుకున్న 600 మిలియన్ డాలర్ల ఒప్పందం ప్రకారం భారత సైన్యానికి ఆరు ఎహెచ్–64ఇ అపాచీ అటాక్ హెలికాప్టర్ల డెలివరీ చేయనుంది. అయితే గతంలో రెండుసార్లు గడువులోపు అందించలేకపోయాయి. మొదట మే–జూన్ 2024కి షెడ్యూల్ చేయగా, అంతరాయాల కారణంగా డెలివరీ గడువును డిసెంబర్ 2024కి వాయిదా వేశారు. మంగళవారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, అమెరికా రక్షణ కార్యదర్శి ఫీట్ హెగ్సేత్‌తో ఫోన్‌లో సంభాషణ నిర్వహించిన తర్వాత ఈపరిణామం చోటుచేసుకుంది. ఇరుదేశాల మధ్య రక్షణ సహకారాన్ని పెంపొందించడానికి కొనసాగుతున్న, రాబోయే కార్యక్రమాలను ఇరువురు నేతలు సమీక్షించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్ సమయంలో అమెరికా అందించిన మద్దతుకు హెగ్సెట్‌కు రాజ్‌నాథ్ సింగ్ కృతజ్ఞతలు తెలిపారు. సరిహద్దు ఉగ్రవాద దాడులను ముందస్తుగా నిరోధించే, తనను తాను రక్షించుకునే హక్కు భారత్‌కు ఉందని ఆయనకు చెప్పారు. హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఎఎల్) తయారు చేస్తున్న తేజస్ లైట్ కంబాట్ –ఎంకె1ఎ విమానం కోసం అమెరికా తయారుచేసిన జనరల్ ఎలక్ట్రిక్ ఇంజిన్‌లను సకాలంలో అందించాలని రాజ్‌నాథ్ సింగ్ కోరారు. భారత్‌లో జెట్ ఇంజన్ల కోసం ఉత్పత్తి యూనిట్ ఏర్పాటుపై కూడా ఆయన మాట్లాడారు. ఎల్‌సిఎ తేజస్ కోసం జిఇ జెట్ ఇంజన్ల డెలివరీకి సంబంధించిన నిర్దిష్ట కాలపరిమితిని వెల్లడించడానికి రక్షణశాఖ నిరాకరించింది.

# పాక్ సెలబ్రిటీల సోషల్ మీడియా ఖాతాలను మరోసారి బ్లాక్ చేసిన భారత్

న్యూఢిల్లీ–ప్రజా స్వేచ్ఛ



దాయాది పాకిస్థాన్‌కు చెందిన సెలబ్రిటీల సోషల్ మీడియా ఖాతాలను భారత్ మరోసారి బ్లాక్ చేసింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాక్‌కు చెందిన పలు మీడియా సంస్థల అకౌంట్లు, సెలబ్రిటీల సోషల్ మీడియా ఖాతాలను భారత్ విత్‌హెల్డ్‌లో ఉంచిన విషయం తెలిసిందే. అయితే, బుధవారం ఆ నిషేధాన్ని ఎత్తివేసింది. దీంతో సోషల్ మీడియాలో పాక్‌కు చెందిన సెలబ్రిటీల ఖాతాలు, పోస్టులు ప్రత్యక్షమయ్యాయి. దీనిపై దేశ వ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమైంది. నెటిజన్లు ఆయా ఖాతాలను బ్లాక్ చేయాలని డిమాండ్ చేశారు. దీంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అయితే, దీనిపై ప్రభుత్వం అధికారిక ప్రకటన చేయలేదు. గురువారం ఉదయం నుంచి పాకిస్థాన్‌కు చెందిన పలువురు ప్రముఖుల సోషల్ మీడియా ఖాతాలు భారత్‌లో కనిపించలేదు. హనియా అమీర్, మహీరా ఖాన్, షాహిద్ అఫ్రిది, మావ్రా హొకేన్, ఫవాద్ ఖాన్ వంటి పాకిస్థానీ ప్రముఖుల ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ ప్రొఫైల్స్ గురువారం ఉదయం నుంచి అందుబాటులో లేకుండా పోయాయి. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌పై భారత్ పలు ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే ఆ దేశానికి చెందిన పలువురు ట్విట్టర్ అకౌంట్లు, పలు యూట్యూబ్ ఛానళ్లపై బ్యాన్ విధించింది. పాక్ ప్రభుత్వానికి చెందిన పలు సోషల్ మీడియా ఖాతాలను కూడా విత్‌హెల్డ్ చేసింది. అంతేకాదు, తప్పుడు, రెచ్చగొట్టే, సున్నితమైన మతపరమైన అంశాల కంటెంట్‌ను ప్రసారం చేస్తున్నాయని పాకిస్థాన్ యూట్యూబ్ చానళ్లపై కూడా నిషేధం విధించింది. ఇందులో పాకిస్థాన్ మాజీ క్రికెటర్ షోయబ్ అఖ్తర్‌కు చెందిన యూట్యూబ్ చానల్ కూడా ఉన్నది. హోం శాఖ సిఫారసు మేరకు డాన్ న్యూస్, జియో న్యూస్, సమా టీవీ, సునో న్యూస్, ది పాకిస్థాన్ రెఫరెన్స్ తదితర యూట్యూబ్ చానళ్లపై కేంద్రం నిషేధం విధించింది.

# ఫ్యూయల్ బ్యాన్‌పై ఢిల్లీ సర్కార్ యూటర్న్

న్యూఢిల్లీ –ప్రజా స్వేచ్ఛ



జీవితకాలం ముగిసిన వాహనాలకు ఆయిల్ పంపుల వద్ద ఇంధనాన్ని నిషేధిస్తూ ఢీల్లీ ప్రభుత్వం ఇటీవలే నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నిర్ణయం జులై 1 నుంచి అమల్లోకి వచ్చింది. అయితే, ఈ నిర్ణయంపై ఢిల్లీ ప్రభుత్వం అనూహ్యంగా యూటర్న్ తీసుకుంది. ఇంధనం బ్యాన్ నిర్ణయంపై వెనక్కి తగ్గింది. ఢిల్లీలో ఇంధనం బ్యాన్ సాధ్యం కావడం లేదని తెలిపింది. వాహన వయసు ప్రకారం స్క్రాప్ చేయలేమని పేర్కొంది. కాలుష్య కారక వాహనాలను మాత్రం సీజ్ చేయనున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు ఇంధనం బ్యాన్ విధిస్తూ గతంలో జారీ చేసిన ఉత్తర్వులను ఢిల్లీ సర్కార్ ఉపసంహరించుకుంది. వాహన కాలుష్యాన్ని తగ్గించడంలో భాగంగా 10 సంవత్సరాల కంటే పాత డీజిల్ వాహనాలు, 15 సంవత్సరాల కంటే పాత పెట్రోల్ వాహనాలకు పెట్రోల్ బంకుల్లో ఇంధనం నిపడాన్ని అనుమతించేది లేదని ఢిల్లీ ప్రభుత్వం ఇటీవలే ప్రకటించిన విషయం తెలిసిందే. మంగళవారం నుంచి దానిని అమలు చేస్తున్నది. దీనికోసం దేశ రాజధానిలోని 500 పెట్రోల్ బంకుల్లో ఆటోమేటెడ్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ కెమెరా సిస్టమ్‌లను ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. అదేవిధంగా 100 ప్రత్యేక బృందాలను ఢిల్లీ రవాణా శాఖ నియమించింది. ఈ ఏడాది నవంబర్ 1 నుంచి గురుగ్రామ్, ఫరీదాబాద్, ఘజియాబాద్, గౌతమ్ బుద్ధ నగర్, సోనిపట్‌లకు ఈ నిషేధాన్ని విస్తరించనున్నారు. అలాగే వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి నేషనల్ క్యాపిటల్ రీజియన్ లోని మిగిలిన ప్రాంతాల్లో అమలు చేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే, ఈ నిర్ణయంపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తుండటంతో వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. ఢిల్లీ–ఎన్‌సీఆర్ ప్రాంతంలో జీవితకాలం ముగిసిన వాహనాలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. నివేదికల ప్రకారం, ఢిల్లీలో జీవితకాలం ముగిసిన బైకుల సంఖ్య 62 లక్షలు ఉండగా, నాలుగు చక్రాల వాహనాలు 41 లక్షలు ఉన్నాయి. ఎన్‌సీఆర్‌ను పరిగణనలోకి తీసుకుంటే.. హర్యానాలో సుమారు 27.5 లక్షల వాహనాలు, ఉత్తరప్రదేశ్‌లో 12.4 లక్షలు, రాజస్థాన్‌లో 6.1 లక్షల వాహనాలు జీవితకాలం ముగిసిపోయాయి. 2018లో, సుప్రీంకోర్టు ఢిల్లీలో 10 సంవత్సరాల కంటే పాత డీజిల్ వాహనాలను, 15 సంవత్సరాల కంటే పాత పెట్రోల్ వాహనాలను నిషేధించింది.

# 170 విమానాలు రద్దు.. ఇబ్బందుల్లో 30 వేల మంది ప్రయాణికులు

పారిస్ –ప్రజా స్వేచ్ఛ



ఫ్రాన్స్‌లో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సిబ్బంది సమ్మె చేస్తున్నారు. దీంతో అక్కడ వందల సంఖ్యలో విమానాలను రద్దు చేశారు. వేలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ర్యాన్‌ఎయిర్ సంస్థ 170 విమానాలను రద్దు చేసింది. దీంతో 30 వేల మంది ప్రయాణికుల హాలీడే ప్రణాళికలు మార్చుకోవాల్సి వచ్చింది. ఫ్రాన్స్‌కు చెందిన రెండు సంఘాలు రెండు రోజుల ధర్నా చేస్తున్నాయి. ఆ దేశంలోని నాలుగో వంతు విమానాలు గ్రౌండ్ అయ్యాయి. పారిస్, నీస్ విమానాశ్రయాల్లో ఎక్కడిక్కడే విమానాలు నిలిచిపోయాయి. యూనియన్ డిమాండ్లు ఆమోదయోగ్యంగా లేవని ఫ్రాన్స్ రవాణా శాఖ మంత్రి ఫిలిప్ టబరాట్ తెలిపారు. ఎయిర్ ట్రాఫిక్ ఉద్యోగుల సమ్మెపై ర్యాన్‌ఎయిర్ సంస్థ ప్రకటన చేసింది. ఫ్రాన్స్‌కు వచ్చిపోయే విమానాలే కాదు.. బ్రిటన్, ఐర్లాండ్, స్పెయిన్, గ్రీస్‌కు వెళ్లే విమానాలకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నట్లు పేర్కొన్నది.

# గ్రూప్‌వన్‌లో అవకతవకల పై పిటిషన్లు

(మొదటి తరువాయి)

అక్కడ ఉన్న రెండు కేంద్రాలలో 1500 మంది అభ్యర్థులు మెయిన్స్ రాశారు. మిగతా పరీక్షా కేంద్రాల్లో రాసిన వాళ్లలో అంతకంటే ఎక్కువ మందే ఎంపికయ్యారు. కోఠిలోని రెండు కేంద్రాలను కేవలం మహిళలకు కేటాయించడంతో సౌకర్యాలను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నాం. ఉద్యోగానికి ఎంపిక కాని అభ్యర్థులు ఏవేవో అనుమానాలతో పిటిషన్లు దాఖలు చేశారు. వారు చేస్తోన్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవాలు లేవు. కేవలం అపోహలు మాత్రమేనని వాదించారు. గ్రూప్ 1కు ఎంపికైన తెలుగు మీడియం అభ్యర్థులు 9.95 శాతం, ఆంగ్ల మాధ్యమం అభ్యర్థులు 89.88 శాతం, ఉర్దూ మాధ్యమంలో 0.1 శాతంగా ఉన్నారు. ఏపీలో రెండేళ్ల క్రితం నిర్వహించిన ఏపీపీఎస్సీ పరీక్షల్లోనూ ఆంగ్ల మాధ్యమ అభ్యర్థులే ఎక్కువగా ఉన్నారు. టీజీపీఎస్సీకి తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మాధ్యమ అభ్యర్థుల పట్ల ఎలాంటి వివక్ష లేదు. అందరికీ నిపుణులు ఎంపిక చేసిన అంశాల ఆధారంగా మార్కులు వేశారని కోర్టుకు తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఎవాల్యుయేటర్‌కు ఏమైనా మార్గదర్శకాలున్నాయా అని ప్రశ్నించింది. టీజీపీఎస్సీ నుంచి వివరాలు తీసుకొని సీల్డ్ కవర్‌లో సమర్పిస్తామని నిరంజన్‌రెడ్డి కోర్టుకు తెలిపారు. దీంతో విచారణను ఉన్నత న్యాయస్థానం నేటికి వాయిదా వేసింది.

# ప్రారంభమైన అమర్‌నాథ్ యాత్ర

(మొదటి తరువాయి)

కిమీ రూటు నుంచి, సెంట్రల్ కశ్మీర్ లోని గండెర్‌బాల్ సోనామార్గ్ ఏరియా14 కిమీ బల్తాల్ రూటు నుంచి గురువారం తెల్లవారు జామున బయలుదేరారు. యాత్రికులు 'భంభం బోలే.. హరహరమహాదేవ్' నినాదాలతో ముందుకు సాగారు. ముందుగా భరించలేని వాతావరణంలో కష్టతరమైన మార్గం ఉన్నా వారి ముఖాల్లో ఆనందం తొంగి చూసింది. యాత్రికులు తమకు కట్టుదిట్టమైన భద్రత, ఇతర సౌకర్యాలు కల్పించడంపై సంతోషం వ్యక్తం చేశారు. యాత్రికులతోపాటు కేంద్ర మంత్రి శోభ కరండ్లజే కూడా బల్తాల్ రూటులో బయలుదేరారు. బుధవారం జమ్ము లోని భగవతి నగర్ శిబిరం నుంచి మొదటి బ్యాచ్ 5892 మంది యాత్రికులు బయలుదేరారు. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. యాత్రికులు మధ్యాహ్నం కశ్మీర్ లోయకు చేరుకోగానే అధికారవర్గాలు, స్థానికులనుంచి వారికి ఘనమైన స్వాగతం లభించింది. గత ఏప్రిల్‌లో పహల్గాం ఉగ్రదాడిలో 22 మంది తుపాకీ కాల్పులకు బలైపోయిన దుర్ఘటన దృష్ట్యా భక్తులకు ఎలాంటి భయాందోళనలు లేకుండా ఉండేందుకు గట్టిభద్రతా ఏర్పాట్లు జరిగాయి. పోలీస్, పారామిలిటరీ విభాగాల నుంచి వేలాది మంది భద్రత సిబ్బందిని నియమించారు.

# అనారోగ్యంతో బాధపడుతున్న కేసీఆర్

(మొదటి తరువాయి)

నందినగర్‌లోని తన నివాసానికి కేసీఆర్‌తోపాటు ఆయన కుటుంబ సభ్యులు చేరుకున్నారు. గత వారం రోజులుగా జలుబు, దగ్గు, తలనొప్పితోపాటు జర్వం ఆయన్ని ఇబ్బంది పడుతున్నట్లు తెలుస్తుంది. జూన్ 11వ తేదీన కాళేశ్వరం ప్రాజెక్ట్ కమిషన్ ఎదుట కేసీఆర్ విచారణకు హాజరైన సంగతి తెలిసిందే. ఆ సమయంలో సైతం ఆయన కొంత అస్వస్థతతో ఉన్నారు. ఆ సమయంలో కమిషన్ ఎదుట విచారణ నేపథ్యంలో ఒపెన్ కోర్టుకు తాను రాలేనని.. ఇన్‌సైడ్ విచారణకు హాజరవుతానంటూ కమిషన్‌కు ఆయన స్పష్టం చేశారు. అందుకు కమిషన్ సానుకూలంగా స్పందించింది. దీంతో ఇన్ సైడ్ విచారణకు కేసీఆర్ హాజరైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆయనకు జ్వరం తీవ్రం కావడంతో ఆస్పత్రికి తీసుకుని వచ్చారు. కెసిఆర్ వెంట భార్య శోభారాణి, కెటిఆర్,హరీష్ రావు, మాజీ ఎంపి సంతోష్ కుమార్ ఉన్నారు.

# పదేళ్లపాటు బీసీలు యాదికి లేరా

(మొదటి తరువాయి)

రాజకీయ శూన్యంలో ఉన్న కవిత ఉనికి కోసమే మాట్లాడుతోందని ఎద్దేవా చేశారు. పదేండ్లు బిసిలకు మాజీ సిఎం కెసిఆర్ ఏం చేశారని మహేష్ గౌడ్ ప్రశ్నించారు. బిసిల రిజర్వేషన్లు తగ్గించింది కెసిఆర్ కాదా? అని నిలదీశారు. కాంగ్రెస్ లో కోవర్టులున్నారన్న ఎమ్మెల్యే అనిరుధ్ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనిరుధ్ వ్యాఖ్యలపై తీవ్రంగా పరిగణిస్తున్నామని, పార్టీ నేతలు మాట్లాడేటప్పుడు చూసుకుని మాట్లాడాలని సూచించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా మాట్లాడితే ఎలా? అని మండిపడ్డారు. క్రమశిక్షణ విషయంలో రాజీపడేది లేదని, బనకచర్లపై అసెంబ్లీలో చర్చకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మహేష్ కుమార్ గౌడ్ సవాల్ విసిరారు.

# 5న బీజేపీ అధ్యక్షుడిగా రామచంద్రరావు బాధ్యతలు

(మొదటి తరువాయి)

భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయనున్నారని కమలం పార్టీ వర్గాలు తెలిపాయి. ఇటీవల తెలంగాణ భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు.

బీజేపీ హైకమాండ్ ఆదేశాల మేరకే రామచంద్రరావును పార్టీ చీఫ్ గా ఏకగ్రీవంగా ఎంపిక చేసింది. కానీ, రామచంద్రరావు ఎంపికపై అసంతృప్తి వ్యక్తం చేసిన గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజా సింగ్ నామినేషన్ వేయడానికి ప్రయత్నించినప్పటికీ కౌన్సిల్ సభ్యుల బలం లేకపోవడంతో ఆయన నామినేషన్ తీసుకోలేదు. దీంతో అసంతృప్తితో ఉన్న ఆయన పార్టీకి రాజీనామా చేశారు. అలాగే, అధ్యక్ష రేసులో ఉన్న ఎంపీ ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, బండి సంజయ్‌లు కమలం పార్టీ హైకమాండ్ ఆదేశాల మేరకు రామచంద్రారావుకు మద్దతు ఇస్తున్నట్లు వెల్లడించారు. దీంతో కిషన్ రెడ్డి స్థానంలో తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా రామచంద్రరావు ఎన్నికయ్యారు. ఆయన శనివారం నాడు పదవీ బాధ్యతలు చేపట్టబోతున్నారు.

# పెట్టుబడులకు సర్కారు అండ

(మొదటి తరువాయి)

చేయడం సంతోషంగా ఉందన్నారు.డిసెంబర్ 9వ తేదీన తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించ బోతున్నట్లు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రకటించారు. రాబోయే వందేళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ విజన్ డాక్యుమెంట్‌ను రూపొందిస్తున్నామన్నారు. మహేశ్వరంలో ఫోర్త్ సిటీ భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించబోతున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వాలు మారినా మన పారిశ్రామిక పాలసీలు మార్చలేదని గుర్తు చేశారు. పెట్టుబడులకు మెరుగైన అవకాశాలు కల్పిస్తూ ముందుకు వెళుతున్నామని వివరించారు. పెట్టుబడులను ఆకర్షించడమే కాదు.. వారికి లాభాలు చేకూరేలా రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వంపై నమ్మకం ఉంచి యూనిట్ ఏర్పాటు చేసిన మలబార్ గ్రూప్‌నకు ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. అభివృద్ధిలో తెలంగాణ, తమిళనాడు, కేరళ పోటీపడుతున్నాయని చెప్పారు.మహేశ్వరంలో ఇండస్ట్రియల్ పార్కు, 'మలబార్ జెమ్స్ అండ్




జ్యువెలరీ' తయారీ యూనిట్‌ను మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. 'పెట్టుబడులను ఆకర్షించడంలో తెలంగాణ ముందుంది. హైదరాబాద్‌కు దేశంలో మరే నగరంతోనూ పోటీ లేదు.. ప్రపంచ నగరాలతోనే పోటీ. రానున్న వందేళ్లను దృష్టిలో పెట్టుకుని విజన్-2047 ప్రణాళికను రూపొందించుకున్నాం. నగర అభివృద్ధి కోసం దేశ, విదేశాలకు చెందిన కన్‌స్టలెంట్స్ పనిచేస్తున్నాయి. పెట్టుబడిదారులకు రక్షణ కల్పించి వారి వ్యాపారం లాభాల్లో సాగేలా సహకరిస్తున్నాంఅని సీఎం తెలిపారు. అంతకుముందు మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ తెలంగాణలో తయారీ రంగం అభివృద్ధి ఎక్కువగా ఉందని.. 9 శాతానికి పైగా వృద్ధి సాధిస్తోందని చెప్పారు. గ్రీన్ ఇండస్ట్రియల్, నూతన ఎంఎస్ఎంఈ పాలసీ-2025ను ప్రభుత్వం ఆమోదించిందని తెలిపారు. రాష్ట్రంలో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు 4,200 దరఖాస్తులు వచ్చాయన్నారు. 15 రోజుల్లోనే 98 శాతం దరఖాస్తులను పరిష్కరిస్తున్నామని చెప్పారు. సింగిల్ విండో విధానంలో పారదర్శకంగా, వేగంగా అనుమతులు ఇస్తున్నామన్నారు.

# ప్రధాని మోడీకి ఘనా అత్యున్నత పురస్కారం

(మొదటి తరువాయి)

ఘనాలో ప్రధాని మోదీకి ఆ దేశ ప్రతినిధులు, ప్రజల నుంచి సాదర స్వాగతం లభిస్తోంది. ప్రధాని మోదీ, ఘనా అధ్యక్షుడు జాన్ డ్రామానీ మహామాతో పలు భాగస్వామ్య అంశాలపై చర్చించారు. ఇండియా.. ఘనాతో యూపీఐ డిజిటల్ చెల్లింపుల విధానాన్ని పంచుకునేందుకు సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా మోదీ చెప్పారు. ఉగ్రవాదం మానవాళికి శత్రువని.. ఇరు దేశాలు స్పష్టం చేశాయని, ఉగ్ర ముప్పును ఎదుర్కోవడంలో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించినట్లు మోదీ వెల్లడించారు. రక్షణ, భద్రతా రంగంలో ఇరుదేశాలు కలిసి ముందుకు సాగుతాయని మోదీ చెప్పారు. సాయుధ దళాల శిక్షణ, సముద్ర భద్రత, రక్షణ సామాగ్రి సరఫరా, సైబర్ భద్రత తదితర రంగాల్లో భారత్-ఘనా దేశాల మధ్య పరస్పర సహకారం పెరుగనున్నదని ప్రధాని మోదీ తెలిపారు. అటు, సంస్కృతి, సాంప్రదాయ వైద్యం తోపాటు పలు రంగాల్లో సహకారాన్ని అందించే నాలుగు ఒప్పందాలపై ఇరు దేశాలు సంతకం చేశాయి. అనంతరం ఘనా పార్లమెంటును సందర్శించి సభ్యులను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. ఈ గౌరవనీయమైన సభలో ప్రసంగించడం తనకు



చాలా గౌరవంగా ఉందన్న మోదీ.. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య ప్రతినిధిగా, 1.4 బిలియన్ల భారతీయుల సద్భావన, శుభాకాంక్షలను తీసుకువచ్చానని అన్నారు. బుధవారం సాయంత్రం తన ప్రియ స్నేహితుడు, అధ్యక్షుడు జాన్ మహామా నుంచి ఘనా జాతీయ అవార్డును స్వీకరించడం హృదయపూర్వక అనుభవమని మోదీ సభకు చెప్పారు. భారతదేశం ప్రజాస్వామ్యానికి తల్లని చెప్పిన మోదీ.. మనకు, ప్రజాస్వామ్యం కేవలం ఒక వ్యవస్థ మాత్రమే కాదన్నారు. ఇది మన ప్రాథమిక విలువలలో ఒక భాగమని చెప్పుకొచ్చారు. భారతదేశంలో 2,500 కంటే ఎక్కువ రాజకీయ పార్టీలు, వివిధ రాష్ట్రాలను పరిపాలించే 20 వేర్వేరు పార్టీలు, 22 అధికారిక భాషలు, వేలాది మాండలికాలు ఉన్నాయని మోదీ చెప్పారు. భారతదేశానికి వచ్చిన ప్రజలను ఎల్లప్పుడూ హృదయపూర్వకంగా స్వాగతించడానికి ఇదే కారణమని ప్రధాని అన్నారు.

# చిత్రాల పైరసీతో భారీ బిజినెస్

(మొదటి తరువాయి)

పోలీసులు విచారిస్తున్నారు. టాలీవుడ్‌లో దాదాపు 40 పెద్ద సినిమాలను అతడు పైరసీ చేసినట్లు గుర్తించారు. ఈ సినిమాలను హెచ్‌డీ ప్రింట్ రూపంలో పైరసీ చేసి విక్రయించినట్లు కనుగొన్నారు. ఈ భారీ చిత్రాలను పైరసీ చేయడం వల్ల టాలీవుడ్ పరిశ్రమకు రూ. 3,700 కోట్లు నష్టం వాటిల్లిందని సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు. మరోవైపు కామ్ కార్డ్ ద్వారా సినిమాలను పైరసీ చేసినట్లు పోలీసుల ఎదుట కిరణ్ కుమార్ ఒప్పుకున్నాడు. సినిమా థియేటర్లలోనే పైరసీ చేసి వాటిని అతడు మాఫియాకి విక్రయించేవాడు. వన్ తమిళ్ ఎమ్‌వీ సంస్థకు ఈ పైరసీ సినిమాలను అతడు విక్రయించాడు. ఇలా ఒక్కొక్క సినిమాకి అతడు 400 క్రిటో కరెన్సీని తీసుకున్నాడు. ప్రింటోతోపాటు బిట్ కాయిన్స్ రూపంలో వారి నుంచి కిరణ్ కుమార్ నగదు వసూల్ చేశారు. బిట్ కాయన్స్, క్రిప్టో రూపంలో వచ్చిన నగదును గూగుల్ పే ద్వారా ఇండియన్ కరెన్సీకి అతడు మార్చుకున్నట్లు విచారణలో సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తించారు. ఇటీవల విడుదలైన కన్నప్ప, పెళ్లికాని ప్రసాద్, గేమ్ చేంజర్, రాజధాని సినిమాలకు చెందిన ్గ÷ల్స్‌ను కిరణ్ కుమార్ నుంచి సైబర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ల్గ÷దరాబాద్ థియేటర్లలోనే కామ్ కార్డు ద్వారా కిరణ్ ఈ సినిమాలు రికార్డింగ్ చేసినట్లు సైబర్ పోలీసులు గుర్తించారు. ఏడాదిన్నర కాలంలో దాదాపు 40 పెద్దపెద్ద సినిమాలను పైరసీ చేసినట్లు నిందితుడు అంగీకరించాడు. వాటిల్లో తెలుగు, తమిళ సినిమాలు ఉన్నాయి. ఇప్పటివరకూ 65 సినిమాలను రికార్డు చేసినట్లు కిరణ్ కుమార్ పేర్కొన్నారు. వన్ తమిళ్‌బ్లాస్టర్, వన్ తమిళ్‌ఎమ్‌వీ, 5 మూవీరూల్జ్, వెబ్ సైట్లకు ఈ పైరసీ సినిమాలను విక్రయించినట్లు తెలుస్తోంది. తండేల్, సింగిల్, కిస్మత్ (హిందీ), రోమాంటిక్, గేమ్ ఆన్, పెళ్లి కానీ ప్రసాద్, రాజధాని ్గ÷ల్స్, ప్రతిరోజు పండుగే చిత్రాలు అతడు పైరసీ చేసిన జాబితాలో ఉన్నాయి. సినిమా హాళ్లకు వెళ్లి అనువైన చోట టిక్కెట్ బుకింగ్ చేసుకుని పైరసీకి ప్లాన్ చేసాడని గుర్తించారు.

# రాహుల్ గాంధీ తెలంగాణ ప్రజలకు తీరని ద్రోహం చేశారు

(మొదటి తరువాయి)

తెలంగాణకు ద్రోహం చేయడంలో బీజేపీతో రాహుల్ గాంధీ కలిసి పనిచేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ రైతుల నోట్లో మట్టి కొట్టే బనకచర్ల ప్రాజెక్టు విషయంలో రాహుల్ మౌనంగా ఉండడం ముమ్మాటికి కుట్రే అన్నారు కేటీఆర్. గోదావరిలో తెలంగాణకు న్యాయంగా రావాల్సిన వాటాను తన గురువు చంద్రబాబుకు రేవంత్ రెడ్డి ధారాదత్తం చేస్తుంటే ఆపకుండా రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ అగ్రనాయకత్వం ఈ ప్రాంతానికి తీరని అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. 2014 పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీల అమలుపై నరేంద్రమోడీ ప్రభుత్వాన్ని ఇప్పటి వరకు రాహుల్ గాంధీ ప్రశ్నించలేదని కేటీఆర్ గుర్తుచేశారు. కాళేశ్వరం లేదా



పాలుమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హెూదా, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ గురించి కేంద్రాన్ని రాహుల్ ఎందుకు నిలదీయడం లేదో చెప్పాలన్నారు. విభజన చట్టంలో ఉన్న ఐటి ఇన్వెస్టిమెంట్ రీజియన్ ను 2015లోనే మోడీ ప్రభుత్వం రద్దు చేస్తే రాహుల్ గాంధీ మాట మాట్లాడకుండా కేంద్ర ప్రభుత్వానికి వత్తాసు పలికారన్నారు. వరంగల్ ప్రజల చిరకాల కోరిక అయిన కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ విషయంలో కూడా రాహుల్ వ్యవహరించిన తీరును ప్రజలు ఇంకా మరిచిపోలేదన్నారు. ఇక బొగ్గు బ్లాక్‌లను కేటాయించకుండా తెలంగాణ కొంగు బంగారం సింగరేణి అస్థిత్వాన్నే మాయం చేయాలనుకున్న మోడీ ప్రభుత్వ కుట్రలపై రాహుల్ గాంధీ ఏ రోజు కూడా లోక్‌సభలో మాట్లాడలేదన్నారు.

# సంపాదకీయం

## పరిశ్రమల్లో ఎమర్జెన్సీ సేఫ్టీ ఆడిట్ జరగాలి

పారిశ్రామిక వాడల్లో ప్రమాదాలు కలవరపెడుతున్నాయి. ఇది ఒక్క పాశమైలారం గురించే కాదు... దేశమంతా ఇదే దుస్థితి నెలకొంది. ప్రధానంగా ప్రమాదం జరిగినప్పుడు హడావిడి చేస్తున్న ప్రభుత్వం, అధికారులు వ్యవహారం సద్దుమణిగాక పట్టించుకోవడం లేదు. ఎందుకంటే ప్రమాదాల్లో ఎంతమంది మరణించారో కూడా లెక్కలు తెలియడం లేదు. సరికదా తెలుసుకునే ప్రయత్నాలు చేయడం లేదు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం గురించి నిత్యం వల్లెవేసే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా భారీ పరిశ్రమలన్నింటిలో రెగ్యులర్‌గా సేఫ్టీ ఆడిట్ చేయించాలి. పని పరిస్థితులను మెరుగుపరచాలి. పారిశ్రామిక ప్రమాదాలు తరచూ జరిగే పారిశ్రామిక వాడలు ఉన్న ప్రాంతాల్లో వంద పడకల బర్న్ వార్డులతో కూడిన ఆసుపత్రులు నిర్మించాలి. ప్రతి నెలా అన్ని పరిశ్రమల్లోనూ తనిఖీలు నిర్వహించి, భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు చేపట్టాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని అనుసరించేలా ఒత్తిడి తేవాలి. ఇప్పటికే పాశమైలారంనకు సంబంధించి అనేకమంది బాధితులు ఆస్పత్రి ముందు వచ్చి రోదిస్తున్నా..స్పందించడం లేదు. మావారు ఏమయ్యారన్న ప్రశ్నలకు సమాశానం రావడం లేదు. ప్రమాదం జరిగిన సోమవారం నాడు పరిశ్రమలోకి ఎంతమంది వెళ్లారనడానికి సరైన లెక్కలు లేవు. దీనికి కూడా కారణం ఉంది. మనుషులతో పాటు, రికార్డులు కూడా బుగ్గికావడమే ఇందుకు నిదర్శనం. తెలంగాణ చరిత్రలోనే అతి పెద్ద పారిశ్రామిక ప్రమాదంగా సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచీ ఇండిస్ట్రీస్ లిమిటెడ్ దుర్ఘటన నిలిచిపోయింది. ఇప్పటికి 40 మంది కార్మికులు మరణించగా, మరో 37 మంది తీవ్రంగా గాయపడినట్టు గుర్తించారు. ఆ సమయంలో విధుల్లో ఉన్న 147 మందిలో మిగిలిన వారి కోసం రెండు రోజులుగా గాలింపు కొనసాగుతూనే ఉంది. కొందరి గుర్తింపు భారంగా మారింది. డిఎన్‌ఎ టెస్టులు కూడా కష్టంగానే మారాయి. బూడిదకుప్పల నుంచి డిఎన్‌ఎ టెస్టు చేయడం సాధ్యం కావడం లేదని సమాచారం. ఇకపోతే ఉద్యోగానికి వెళ్లిన వారెంతమంది అన్నది ప్రాథమికంగా తేల్చాలి. అప్పుడే ఎంతమంది చనిపోయారన్నది తెలుస్తుంది. ఎందుకంటే నవ్వుతూ ఉద్యోగానికి వెళ్లిన కార్మికులు బూడిద కుప్పలుగా మారారు. డిఎన్‌ఎ ఆధారంగా వారి అవశేషాలను గుర్తించాల్సిన దుస్థితి కనిపిస్తోంది. ఎందుకంటే తమవారు ఏరీ అని అడిగే వారి కుటుంబాలకు సమాధానం చెప్పుకోలేని దుస్థితిలో ప్రభుత్వం, అధికారులు, సంస్థ ప్రతినిధులు ఉన్నారు. కార్మికుల భద్రతను గాలికి వదిలేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్వాకమే హైదరాబాద్ శివారు ఔషధ పరిశ్రమలో చోటు చేసుకున్న భారీ విస్ఫోటనంగా చెప్పుకోవాలి. హైదరాబాద్ శివారులోని పరిశ్రమల్లోనే గత రెండు మూడు నెలల్లో నాలుగైదు ప్రమాదాలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్ కూడా అందుకు మినహాయింపు ఏమీ కాదు. విశాఖలో 2020 నాటి ఎల్‌జి పాలిమర్స్ ప్రమాదం 12 మంది కార్మికులను బలిగొంటే, చుట్టుపక్కల ప్రాంతాలన్నింటినీ విషతుల్యంగా మార్చి, వందలమందిని ఆసుపత్రుల పాలు చేసింది. ఆ తరువాత అచ్యుతాపురం సెజ్‌లో 2022 జూన్, ఆగస్టులో 500 మందికిపైగా మహిళలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆ ప్రమాదంపై నివేదిక అమలు మాట అటుంచి వెలుగుచూసిన పాపానే పోలేదు. గత ఏడాది అచ్యుతాపురం సెజ్ ఎసెన్షియా ఫార్మాలోనే 17 మంది మరణించగా, 38 మంది గాయపడ్డారు. ఈ ఏడాది ఆరు నెలల్లోనే అనకాపల్లి జిల్లాలో జరిగిన 11 ప్రమాదాల్లో ఐదుగురు మరణించగా, ఎనిమిదిమంది తీవ్ర గాయాలతో మంచంపట్టారు. పరవాడ ఫార్మాసిటీలో గత ఏడాది విషవాయువుల లీకేజిసహా పలు ప్రమాదాల్లో 10 మంది మరణించగా, 40 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రాణాలకు తెగించి ప్రాణాంతక పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల పక్షాన నిలవకుండా, లాభం కోసం భద్రతను గాలికొదిలేసి ప్రాణాలను బలిగొంటున్న పరిశ్రమల అధిపతుల పక్షాన కేంద్ర, రాష్ట్ర పాలకులు నిలవడం మరింత విషాదం. దేశవ్యాప్తంగా పారిశ్రామిక ప్రమాదాల్లో రోజూ కనీసం ముగ్గురు కార్మికులు మరణిస్తున్నారు. తనిఖీలను తగ్గించి, స్వీయ ధ్రువీకరణలను అనుమతించడం ద్వారా భద్రతాపరమైన నియంత్రణలను బలహీనపరచడమే భారీ ప్రమాదాలకు కారణమన్న అంతర్జాతీయ కార్మిక సంస్థ హెచ్చరికలను ఇప్పటికైనా గుర్తించి, కఠిన చర్యలకు ఉపక్రమించాలి. యాజమాన్యాలు అత్యాశతో రసాయన, ఔషధ పరిశ్రమలుసహా వివిధ పరిశ్రమల్లో అత్యంత కీలకమైన స్థానాల్లో అతి తక్కువ వేతనాలకు పనిచేసే తగిన నైపుణ్యం, విద్యార్హత లేని వారిని, ఇతర రాష్ట్రాల వారిని కాంట్రాక్ట్, డైలీవేజ్ ప్రాతిపదికన నియమిస్తున్నాయి. కాలం చెల్లిన రియాక్టర్లు, యంత్రాలను వినియోగించడం తోపాటు వాటికి దగ్గరగా వెల్డింగ్, షోల్డరింగ్ చేయడం, యంత్రాలు, వాల్వులపై పర్యవేక్షణ లేకపోవడం, సిబ్బందికి భద్రతాపరమైన పరికరాలు, తగిన శిక్షణ ఇవ్వకపోవడం, భద్రతా తనిఖీలు జరగకపోవడం పలు రసాయనాలను దగ్గరగా నిల్వచేయడం తదితర కారణాల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పలు నివేదికలు ఘోషిస్తు న్నాయి. కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చేసి, తమకు జరిగిన అన్యాయాన్ని,యాజమాన్యా ల దుర్మార్గాన్ని ప్రశ్నించలేని స్థితికి కార్మికులను నెట్టేసిన తీరు పాలకుల నిరంకుశ విధానాలకు నిదర్శనం గా చూడాలి. కార్పొరేట్లకు కొమ్ముకాయడం మాని, సేఫ్టీ వర్క్ లాంటి కార్మిక అనుకూల నినాదాలను తీసుకోవడం తక్షణ అవసరం. కార్మికుల సంక్షేమం ద్వారానే సంస్థలు బలపడాలి తప్ప, కార్మికులను పొట్టన పెట్టుకుని ముందుకు సాగాలన్న విధానాలకు పాతరేయాలి. ముందుగా తెలంగాణ, ఎపిల్లో ఉన్న పారిశ్రామిక వాడల్లో ఎమర్జెన్సీ సేఫ్టీ ఆడిటింగ్ చేపట్టాలి. ఆయా పరిశ్రమల్లో నాణ్యతాపరమైన, భద్రతాపరమైన ఏర్పాట్లు ఉన్నాయా లేదా అన్నది విశ్లేషించాలి. అప్పుడే ప్రమాదాలకు అడ్డుకట్ట వేయగలం.

# స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు తగ్గించిందే కేసీఆర్

### టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి




ప్రజా స్వేచ్ఛ –హైదరాబాద్

కేసీఆర్ అధికారంలో ఉన్న సమయంలో స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు తగ్గించారని టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పారు. పదేండ్లు అధికారంలో ఉండి ఆయన బీసీలకు ఏం సాధించారని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఖర్గేకు లేఖ రాయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఆ లేఖ జాగృతి తరుపున రాశారా? లేక బీఆర్ఎస్ పార్టీ తరుపున రాశారా? ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. స్థానిక సంస్థలతోపాటు విద్య, వైద్య రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ అమలు చేసిందని గుర్తు చేశారు. ఆపార్టీ బీసీ డిక్లరేషన్ ప్రకటించే సమయంలో కవిత లిక్కర్ కేసులో జైల్లో ఉన్నారని ఎద్దేవా చేశారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంలో విఫలమైనందు వల్లే బీఆర్ఎస్‌ను ప్రజలు ఓడించారని తెలిపారు. సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని చెప్పారు. శుక్రవారం ఎల్బీస్టేడియంలో తలపెట్టిన సామాజిక సమరభేరి సభకు గ్రామ, మండల, జిల్లా అధ్యక్షులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మెన్లతో సహా 40వేల మంది హాజరు కానున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఖర్గే గ్రామ అధ్యక్షులకు దిశా నిర్దేశం చేస్తారని ఆయన తెలిపారు.

# కొవిడ్ టీకాలు సురక్షితమైనవి

### – సీరమ్ ఇన్‌స్టిట్యూట్




ఢిల్లీ – ప్రజా స్వేచ్ఛ

దేశంలో పలు చోట్ల చోటుచేసుకున్న గుండెపోటు, ఇతర హృద్రోగ సంబంధ మరణాలకు కొవిడ్ వ్యాక్సినే కారణమంటూ ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ విషయంపై కొవిషీల్డ్ తయారీ సంస్థ సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా తాజాగా స్పందించింది. టీకా, గుండె సంబంధిత మరణాల మధ్య ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు భారత వైద్య పరిశోధనా మండలి ఎయిమ్స్ సంయుక్తంగా చేపట్టిన అధ్యయనాన్ని ఉటంకిస్తూ.. 'టీకాలు సురక్షితమైనవి, శాస్త్రీయంగా ధృవీకరించబడ్డాయి' అని స్పష్టం చేసింది.దేశంలో పలు చోట్ల చోటుచేసుకున్న గుండెపోటు, ఇతర హృద్రోగ సంబంధ మరణాలకు కొవిడ్ వ్యాక్సిన్‌కు ఎలాంటి సంబంధం లేదని కేంద్రం బుధవారం స్పష్టం చేసిన విషయం తెలిసిందే. కర్ణాటకలోని హసన్ జిల్లాలో నెల రోజుల వ్యవధిలో 20 మంది గుండె సంబంధ సమస్యలతో మరణించడానికి కొవిడ్ వ్యాక్సినే కారణమంటూ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించిన క్రమంలో కేంద్రం వివరణ ఇచ్చింది. ఇటీవల కర్ణాటకలోని హాసన్ జిల్లాలో పలువురు యువకులు హార్ట్ ఎటాక్‌తో మరణించారు. దీనిపై సీఎం సిద్ధరామయ్య స్పందిస్తూ.. కొవిడ్ టీకాను వేగంగా పంపిణీ చేయడం వల్లే అది జరుగుతుండొచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. చెస్ట్‌లో నొప్పి, ఊపిరాడకపోవడం వంటి లక్షణాలుంటే నిర్లక్ష్యం చేయకుండా దగ్గరలోని ఆసుపత్రిలో వెంటనే పరీక్షలు చేయించుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సీఎం ఆరోపణలతో ఆకస్మిక మరణాలకు కొవిడ్ టీకాలే కారణమంటూ సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు భారత వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్), ఢిల్లీ ఎయిమ్స్ సంయుక్తంగా లోతైన అధ్యయనాన్ని చేపట్టాయి. ఈ పరిశోధనలో భాగంగా కొవిడ్ నుంచి కోలుకున్న తర్వాత మరణించిన పలు కేసులను శాస్త్రవేత్తలు క్షుణ్ణంగా విశ్లేషించారు. వారి ఆరోగ్య నేపథ్యం, వ్యాక్సినేషన్ వివరాలు, ఇతర వైద్య సంబంధిత అంశాలను పరిశీలించారు. ఈ అధ్యయనంలో ఆకస్మిక మరణాలకు ప్రధాన కారణం బాధితులకు ముందు నుంచే ఉన్న అనారోగ్య సమస్యలే అని తేలింది. దాదాపు నెలరోజులపాటూ జరిపిన ఈ అధ్యయనంలో జన్యుపరమైన లోపాలు, తీవ్రమైన అనారోగ్య సమస్యలే కారణమని నిర్ధరణ అయ్యింది. వ్యాక్సిన్ల వల్ల కలిగే దుష్ప్రభావాల కారణంగా ఈ మరణాలు సంభవిస్తున్నాయనడానికి ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లభించలేదని నివేదిక పేర్కొంది.

# మాలిలో ముగ్గురు భారతీయులు కిడ్నాప్..

### అల్‌ఖైదా ఉగ్రవాదుల పనిగా గుర్తింపు



ఢిల్లీ – ప్రజా స్వేచ్ఛ

మాలిలో ముగ్గురు భారతీయులు కిడ్నాప్‌కు గురయ్యారు. ఈ విషయాన్ని భారత విదేశాంగశాఖ గురువారం ధ్రువీకరించింది. పశ్చిమ మాలిలోని కాయెస్ ప్రాంతంలోని డైమెండ్ సిమెంటు ఫ్యాక్టరీలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈనెల 1న ఈ ప్రాంతంలో సాయుధ దుండగులు దాడి చేసి.. అక్కడి కార్మికులను బందీలుగా తీసుకెళ్లారు. వారిలో భారత్‌కు చెందిన ముగ్గురు కార్మికులు ఉన్నారు. అల్‌ఖైదా అనుబంధ సంస్థ జమాత్ నుస్రత్ అల్ ఇస్లాం వాల్ ముస్లిమిన్ ఈ దాడిని తామే చేశామని ప్రకటించింది. కిడ్నాప్‌కు గురయిన వారి వివరాలను విదేశాంగశాఖ వెల్లడించలేదు. మాలి రాజధాని బమాకోలోని భారత రాయబార కార్యాలయం స్థానిక అధికారులు, పరిశ్రమ యాజమాన్యంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతుందని విదేశాంగశాఖ తెలిపింది. ఈ ఘటనను భారత్ తీవ్రంగా ఖండించింది. బందీలను సురక్షితంగా, త్వరగా విడుదల చేయడానికి మాలీ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరింది. ఈసందర్భంగా మాలిలోని భారతీయ పౌరులందరూ అప్రమత్తంగా ఉండాలని పేర్కొంది. సాయం కోసం మన రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించింది.

# అమెరికా సుంకాలపై భారత్ ఆందోళన

వాషింగ్టన్ – ప్రజా స్వేచ్ఛ



రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై 500 శాతం సుంకాలు విధిస్తామంటూ అమెరికా ప్రభుత్వం తీసుకొస్తున్న బిల్లు పట్ల భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విషయాన్ని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ తెలిపారు. ఈ బిల్లు రూపొందించిన అమెరికా సెనేటర్ లిండ్సే గ్రాహం వద్ద ఈ మేరకు తమ ఆందోళనలు, ఇంధన భద్రత అవసరాలు గురించి వెల్లడించినట్లు చెప్పారు. బుధవారం వాషింగ్టన్‌లో విలేకరుల సమావేశంలో అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా జైశంకర్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఉక్రెయిన్‌తో శాంతి చర్చల్లో పాల్గొనడానికి రష్యా నిరాకరిస్తే ఆ దేశం నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై 500 శాతం సుంకాలను విధించాలని ఒక బిల్లులో గ్రాహం ప్రతిపాదించినట్లు కథనాలొచ్చిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై గ్రాహంతో భారత రాయబార కార్యాలయం, అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారని జైశంకర్ చెప్పారు.

# ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు పట్టాల పంపిణీ





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

ప్రజా స్వేచ్ఛ...
88ఈరోజు చేర్యాల మండలంలోని కళ్యాణి గార్డెన్స్ లో.. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు పట్టాల పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన మన భువనగిరి ఎంపీ శ్రీ.చామల కిరణ్ కుమార్ రెడ్డి గారు గార్డెన్ లోపలికి అడుగుపెట్టగానే..చేర్యాల మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు శాలువాతో సత్కరించి,సాదర స్వాగతం పలికిన సందర్భంగా.. ఎంపీ గారికి.. చేర్యాల మండల వికలాంగుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో.. చేర్యాల మండల కేంద్రంలో ఒక మాకు ఒక ప్రత్యేక వికలాంగుల భవనాన్ని కేటాయించాలని



కోరుతూ,వినతి పత్రం అందిస్తున్న సమయంలో.. ఎంపీ గారితో పాటు మన ముస్త్యాల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎలికట్టె శ్రీనివాస్ గౌడ్, సీనియర్ నాయకులు మిల్లాపురం అంజయ్య,గౌరవ సలహాదారులు బూరుగు నాగయ్య, ఎలికట్టె నర్సింలు గౌడ్, ఎన్ ఎస్ యు ఐ చేర్యాల మండలాధ్యక్షులు బండారు సతీష్, కాంగ్రెస్ నాయకులు మేడిపల్లి చందు,గోల్డ్ స్మిత్ రమేష్, చిమ్మరవి, యూత్ కమిటీ సభ్యులు బెజ్జరబోయిన అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో మహిళా ప్రిన్సిపాల్ ను నియమించాలి

**డీఈఓ కు వినతి పత్రం అందజేసిన ఎస్ఎఫ్ఐ మిర్యాలగూడ డివిజన్ కమిటీ**




మిర్యాలగూడ ప్రజా స్వేచ్ఛ:-
భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ మిర్యాలగూడ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో డిఈఓ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి భారత విద్యార్థి ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు కుర్ర సైదా నాయక్ మాట్లాడుతూ మిర్యాలగూడ నియోజకవర్గంలో మిర్యాలగూడ మండలం అనంతపురం గ్రామంలో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల లో మహిళ ప్రిన్సిపాల్ ని ఏర్పాటు చేయాలని కోరారు. నియోజకవర్గ వ్యాప్తంగా విద్యార్థినిలు ఆశ్రమ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. కావున మహిళా ప్రిన్సిపాల్ ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థినిలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా విద్యను అభ్యసించడానికి అవకాశం ఉంటుందన్నారు. గర్ల్స్ ఆశ్రమ పాఠశాలకు మహిళా ఉపాధ్యాయుల నియమించడమే ఉత్తమమన్నారు. అదే విధంగా ఆశ్రమ పాఠశాలలో ఉన్న గుట్టను తొలగించాలని పేర్కొన్నారు. గుట్టను తొలగించడం వల్ల విద్యార్థినులకు ఆడుకోవడానికి ప్లే గ్రౌండ్ ఏర్పాటు అయితది అన్నారు. తద్వారా విద్యార్థులు శారీరక దృఢత్వాన్ని పొందగలుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ డివిజన్ అధ్యక్షుడు జగన్ నాయక్, ఎస్ఎఫ్ఐ టౌన్ ఉపాధ్యక్షుడు అనిల్, నాయకులు అఖిల్, బన్నీ, మణి, తరుణ్, కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల పిల్లలకు టై-బెల్టులు పంపిణీ

**చిన్న చిలకమర్రి ప్రాథమిక పాఠశాలలో దాతల సాయంతో కార్యక్రమం**

**విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే లక్ష్యంగా అభినవ ప్రయత్నం**



షాద్‌నగర్, ప్రజా స్వేచ్ఛ...
ఫరూక్‌నగర్ మండల పరిధిలోని చిన్న చిలకమర్రి గ్రామ ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు టైలు, బెల్టులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల అభివృద్ధికి తోడ్పడే దిశగా దాతలు పల్లె నరసింహారెడ్డి, తెలుగు యాదయ్యలు ముందుకొచ్చి ఈ మంచి పనికి తమ వంతు సహకారం అందించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కృష్ణయ్య మాట్లాడుతూ "విద్యార్థులు విద్యాసంస్థలలో సరిగా యూనిఫాం ధరించడం వల్ల ఆత్మవిశ్వాసం పెరిగి, చదువుపట్ల ఆసక్తి, ఉత్తమ ప్రవర్తన పెరుగుతాయన్నారు. టై, బెల్ట్, బూట్లు వంటి అంశాలు వారికి ప్రోత్సాహాన్నిస్తాయి" అని అన్నారు.పాఠశాల అభివృద్ధికి ఇటువంటి సహకారాలు ఎంతో అవసరమని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని హెచ్.ఎం. స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి నాగిళ్ల జగదీశ్వర్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్టిసి ఎండి సజ్జనార్ ను కలిసిన వికలాంగుల సంఘం నాయకులు



హైదరాబాద్, ప్రజా స్వేచ్ఛ...
ఆర్టీసీ ఎండి సజ్జనార్ RTC ను కలిసి కాంగ్రెస్ పార్టీ హామీ, RTC సంబంధిత వికలాంగుల సమస్యల గురించి వివరించిన వికలాంగుల సంఘాల నాయకులు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికలాంగులకు అన్ని రకాల RTC. బస్సులలో ఉచిత రవాణా మహిళల మాదిరిగా కల్పించాలి అని కోరారు.అధికార పార్టీ కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో హామీ కూడా ఇచ్చారని అన్నారు.వికలాంగులకు కేటాయించిన సీట్లు వారికే ఇచ్చే విధానంగా డ్రైవర్ కండక్టర్ బాధ్యత వహించాలని ఆదేశాలివ్వాలని తెలిపారు.వికలాంగులకు 4% అనుకూలమైన ఉద్యోగాలు గుర్తించి భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.RTC వాణిజ్య దుకాణాల్లో, టెండర్లలో వికలాంగులకు 5% రిజర్వేషన్లు, నామినేటెడ్ ప్రత్యేక అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశామని అన్నారు.సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అన్ని బస్ స్టేషన్లు అనుకూలంగా మార్చాలని అన్నారు.ఎండి సజ్జనార్ , త్వరలో ప్రభుత్వంతో చర్చించి సమస్యలు పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.ఈ కార్యక్రమం లో JAVAB TV చీఫ్ ఎడిటర్ నల్గొండ శ్రీను, TVHSS అధ్యక్షులు గుత్తికొండ కిరణ్, సంఘ నాయకులు నాగరాజు, అజీమ్ శివ, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు మధ్యలో ప్రమాద కరంగా గుంత

**-పట్టించుకునే నాధుడు ఏడి అంటూ స్థానిక ప్రజలు.**
**-అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా, ఆచరణ శూన్యం.**
**-నిత్యం రద్దీగా ఉండే రోడ్డు..**
**-ప్రాణాలు పోతే గాని పట్టించుకోరా?**
**-నిలదీస్తున్న స్థానిక ప్రజలు.**

కల్లూరు, ప్రజా స్వేచ్ఛ
ఖమ్మం జిల్లా, కల్లూరు మండలం, కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని గల కప్పల బంధం రోడ్డు నందు వేణుగోపాలస్వామి గుడి మలుపు వద్ద ప్రమాదకరమైన పెద్ద గుంత రోడ్డుపై నెలరోజుల క్రితం ఏర్పడింది. స్థానికంగా ఉన్న ఆర్ అండ్ బి అధికారులకు తెలిపిన ప్రయోజనం సోనియమని అక్కడ ప్రజలు వాపోతున్నారు. నిత్యం రద్దీగా ఉండే కల్లూరు - పుల్లయ్య బంజరు, కప్పల బంధం రోడ్డుపైనే ఈ గుంత ఏర్పడి అటు స్కూల్ బస్సులు, భారీ లారీలు ప్రైవేట్ వాహనాలు టూ వీలర్లు ఎక్కువగా తిరిగే ప్రదేశం కాబట్టి ప్రమాదం పొంచి ఉన్నదని స్థానికులు గట్టిగా చెప్తున్నారు. మరమ్మతులు చేయించి ప్రయాణికుల ప్రాణాలు కాపాడాలని స్థానిక అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. ఇకనైనా స్థానిక అధికారులు స్పందించి రోడ్డు మరమ్మత్తు చేయించాలని వారు కోరుతున్నారు.



## ఆగస్టు 13న వికలాంగుల మహాగర్జన



హైదరాబాద్, ప్రజా స్వేచ్ఛ
ఆగస్టు 13న హైదరాబాద్ లోని LB స్టేడియంలో వికలాంగుల మహాగర్జన నిర్వహించనున్నట్లు VHPS మరియు MRPS వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అన్నారు.ఈ మహా ఘర్జనకు ఆసరా పెన్షన్ దారులందరూ, సిద్ధపడాలని మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు.. గురువారం నాడు హైదరాబాద్ బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ లో వికలాంగుల హక్కుల పోరాట సమితి (VHPS) అత్యవసర రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంద కృష్ణ మాదిగ తెలంగాణ రాష్ట్రంలో వికలాంగులకు 6000/- పెన్షన్ పెంచాలని మరియు ఇతర 24 డిమాండ్ సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. భవిష్యత్ కార్యాచరణ రూపొందించడం కోసం ఈరోజు హైదరాబాద్ బషీర్ బగ్ లో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశామని అన్నారు. ఈ రాష్ట్ర కార్యవర్గ సమావేశం లో కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో VHPS నాయకులు, కార్యకర్తలు, ఇతర వికలాంగుల సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## దేవరకొండ ఎం కె ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బూతు లెవెల్ ఆఫీసర్లతో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించిన

**-ఆర్డిఓ రమణారెడ్డి**




దేవరకొండ /ప్రజా స్వేచ్ఛ..
దేవరకొండ పట్టణం ఎం కె ఆర్ డిగ్రీ కళాశాలలో గురువారము బూతులెవల్ ఆఫీసర్లతో శిక్షణ కార్యక్రమాన్ని ఆర్డిఓ రమణారెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రస్తుత రానున్న ఎన్నికల వ్యవహారాలలో బి ఎల్ ఓ సుల పాత్ర చాలా ముఖ్యమని తమ బాధ్యతను ప్రభుత్వం ఇచ్చే మార్గదర్శకాలను పాటించాలని ఆర్డీవో రమణారెడ్డి అన్నారు. లోకల్ బాడీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అధికారులు సిద్ధంగా ఉండాలని బి ఎల్ ఓ స్ అధికలకు ఆర్డీవో సూచించారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ తహసిల్దార్ మధుసూదన్ రెడ్డి ట్రైనీ మాస్టర్స్ మండలానికి సంబంధించిన బిఎల్వోసు తదితరులు పాల్గొన్నారు.

## పాములపహాడ్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ ఎన్నిక

**అధ్యక్షునిగా సబ్బు హరికృష్ణ రెడ్డి, ఉపాధ్యక్షులుగా మాంద్ర గిరి యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నిక**



మాడుగులపల్లి/ ప్రజా స్వేచ్ఛ
మాడుగులపల్లి మండలంలోని పాములపహాడ్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నూతన అధ్యక్షులుగా సబ్బు హరికృష్ణ రెడ్డి, ఉపాధ్యక్షులు గా మాంద్ర గిరి యాదవ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు సబ్బు హరికృష్ణ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని అన్నారు. గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ తీగల సతీష్, ప్రధాన కార్యదర్శి మామిడి సైదులు, కోశాధికారి నంద్యాల అంబేద్కర్, యూత్ అధ్యక్షులు కునుకుంట్ల సతీష్, యూత్ ఉపాధ్యక్షులు తీగల శ్రీకాంత్,లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రపంచ దేశాలతోనే తెలంగాణకు పోటీ

**పెట్టుబడుల ఆకర్షణలో మొదటి స్థానం మలబార్ బంగారు, వజ్రాభరణాల తయారీ సంస్థ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి**

రంగారెడ్డి, ప్రజా స్వేచ్ఛ...
వందేండ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ రైజింగ్ 2047 విజన్ పేరుతో ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నదనీ, పెట్టుబడులను ఆకర్షించడంలో తెలంగాణ మొదటి స్థానంలో నిలిచిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, ఉత్పత్తుల ఎగమతి విషయంలో తమకు దేశంలోని ఏ రాష్ట్రంతోనూ పోటీ లేదని తెలిపారు. అమెరికా, సింగపూర్, కొరియా, యూకే వంటి అభివృద్ధి చెందిన ప్రపంచ దేశాలతోనే తమ పోటీ ఉంటుందన్నారు. ఢిల్లీ, ముంబై, బెంగళూర్, చెన్నరు సహా దేశంలోని ఏ ఒక్క నగరం కూడా మన హైదరాబాద్‌తో పోటీపడలేదని తెలిపారు. రంగారెడ్డి జిల్లాలోని మహేశ్వరం మండల పరిధిలో 3.45 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన మలబార్ బంగారు, వజ్రాభరణాల తయారీ సంస్థను సీఎం గురువారం ప్రారంభించి మాట్లాడారు. పెట్టుబడులకు తెలంగాణ స్వర్గధామమనీ, ఇక్కడ పెట్టుబడి పెట్టిన వారికి, వారి ఆస్తులకు పూర్తి రక్షణ లభిస్తోందని అన్నారు. 20 ఏండ్లలో పాలకులు మారారే కానీ.. పెట్టుబడులను ఆకర్షించే విషయంలో ప్రభుత్వాల విధానాలు మాత్రం మారలేదని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం పెట్టుబడిదారులను కడుపులో పెట్టి చూసుకుంటుందని హామీ ఇచ్చారు. ఇక్కడ




తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

పెట్టుబడులు పెట్టి భారీ లాభాలు గడించొచ్చని, ఫార్మా, ఇతర ఉత్పత్తుల విషయంలో ఇతర ప్రాంతాలతో పోలిస్తే తెలంగాణ ముందుందన్నారు. బంగారు, వజ్రాభరణాల కొనుగోలు విషయంలో ఇతర రాష్ట్రాల మహిళలతో పోలిస్తే రెండు తెలుగు రాష్ట్రాల మహిళలే ముందుంటారని తెలిపారు. ఆ తర్వాతి స్థానంలో తమిళనాడు, కర్నాటక, కేరళ రాష్ట్రాల మహిళలు ఉంటారన్నారు. బంగారు ఆభరణాల తయారీకి మహేశ్వరం అనువైన



ప్రదేశమని, ఇక్కడ దేశంలోనే అతిపెద్ద యూనిట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని మహేశ్వరం, ముచ్చర్ల, బేగరి కంచె కేంద్రంగా 30 వేల ఎకరాల్లో భారత ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దబోతున్నట్టు చెప్పారు. అంతకు ముందు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. 2035 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. తెలంగాణ తయారీ రంగం గ్రాస్ వాల్యూయాడెడ్(జీవీఏ) 2022–23లో రూ.1.34 లక్షల కోట్లు ఉండగా, 9 శాతం వృద్ధితో 2023–24లో రూ.1.46 లక్షల కోట్లకు చేరిందన్నారు. అదే విధంగా తెలంగాణ జీఎస్‌డీపీలో తయారీ రంగం వాటా 19.5 శాతం ఉండగా, అదే జాతీయ స్థాయిలో 17.7 శాతమే ఉందన్నారు. సింగిల్ విండో సిస్టం టీజీ ఐపాస్ ద్వారా 4200 యూనిట్లకు అనుమతులు

## మల్లికార్జున ఖర్గే కు ఘన స్వాగతం



హైదరాబాద్, ప్రజా స్వేచ్ఛ
ఏఐసీసీ జాతీయ అధ్యక్షులు, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకులు మల్లికార్జున్ ఖర్గే గురువారం సాయంత్రం హైదరాబాద్ చేరుకున్నారు. శుక్రవారం ఎల్బీ స్టేడియంలో జరిగే గ్రామస్థాయి కార్యకర్తల సమ్మేళనంలో ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. మల్లికార్జున ఖరిగే కు ఎయిర్ పోర్ట్ లో ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంత్రులు, సీనియర్ నాయకులు ఘన స్వాగతం పలికారు.

## మంత్రి వెంకట్ రెడ్డి తో భేటీ అయిన కాంగ్రెస్ పార్టీ లోక్ సభ చీఫ్ విప్ కె.సురేష్



హైదరాబాద్, ప్రజా స్వేచ్ఛ...
కేరళ రాష్ట్ర మావళికర సీనియర్ ఎంపీ,లోక్ సభలో కాంగ్రెస్ పార్టీ చీఫ్ విప్ కె.సురేష్ గురువారం నాడు రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఎర్రమంజిల్ లోనీ ఆర్ అండ్ బి కార్యాలయంలో ఆయనతో సమావేశమై పలు అంశాలు చర్చించారు.కె.సురేష్ కేరళ నుండి 8సార్లు ఎన్నికైన సీనియర్ లోక్ సభ సభ్యుడని,తను ఎంపీగా ఉన్నపుడు ఆయనతో పార్లమెంట్ లో ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర మంత్రిగా ఆయనతో భేటీ సంతోషకరం అన్నారు.రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు వంటి అంశాలపై ఇరువురు చర్చించారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వానికి భారంగా మారిందని,అయినా వెల్ఫేర్,డెవలప్మెంట్ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎక్కడా తగ్గకుండా పనిచేస్తున్నామని తెలిపారు.

## ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

**-అఖిల భారత ప్రజా తంత్ర మహిళా సంఘం.**

కల్లూరు, ప్రజా స్వేచ్ఛ...
ఖమ్మం జిల్లా, కల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని పాత ఆస్పత్రి నీ నూతన భవనంలోకి వెంటనే మార్చాలని, ఖాళీగా ఉన్న వైద్య పోస్టులు వెంటనే భర్తీ చేయాలని ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు శీలం పకీరమ్మ , మండల కార్యదర్శి తన్నీరు కృష్ణవేణి గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగుల ఇబ్బందులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు అనంతరం మండల వైద్యాధికారి దృష్టికి సమస్యలను తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రారంభం కావడంతో ఆస్పత్రిలో రోగుల తాకిడి పెరుగుతున్న దృష్ట్యా రోగుల అవసరాలకు తగినట్లుగా ఆసుపత్రిలో సౌకర్యాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఆసుపత్రిలో ఉన్న అన్ని సమస్యలను పరిష్కరించాలని అదేవిధంగా అన్ని గ్రామాల్లో వైద్య క్యాంపులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేనియెడల ప్రజలందరిని సమీకరించి ఐద్వా ఆధ్వర్యంలో ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు శీలం సత్యనారాయణ రెడ్డి’ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు తన్నీరు కృష్ణార్జునరావు పాల్గొన్నారు.





## లబ్ధిదారుల ఇంటి వద్దకే సీఎంఆర్ఎఫ్ చెక్కులతో ఎమ్మెల్యే





**-ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్.**
**-365ఐ24 నియోజకవర్గ ప్రజల శ్రేయస్సే మా అజెండా అంటున్న ఎమ్మెల్యే శ్రీమతి రాగమయి దయానంద్ ,**
**-నిత్యం ప్రజల సమస్యలు, అభివృద్ధి పథకాలు, ప్రయోజనాలే..**
**-గతంలో ఎన్నడూ లేని విధంగా సత్తుపల్లి ప్రజలకు సుపరిపాలన అందిస్తున్న వైనం.**

కల్లూరు ప్రజా స్వేచ్ఛ...
హైదరాబాదు నుంచి తెచ్చా మీ ఇంటికి వచ్చి ఇచ్చా ఎమ్మెల్యే మాట తో లబ్ధిదారులలో ఆనందం వెలకట్టలేకుంది, కల్లూరు మండలం మరియు కల్లూరు పట్టణం లో మొత్తం 23 సీఎంఆర్ చెక్కులు గాను 5,73,500 రూపాయల చెక్కులు లబ్ధిదారుని ఇంటికి వెళ్లి అందజేసిన సత్తుపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, కల్లూరు మండలం, కల్లూరు పట్టణం లో సీఎంఆర్ఎఫ్ చెక్కుల లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఇంటి ఆడబిడ్డగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు నేరుగా లబ్ధిదారికే అందించిన ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ , సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు భరోసాగా ఇంటికి వెళ్లి అనారోగ్యం నుంచి కోల్కకుంటున్నా వారిని పరామర్శించి, ఒక ప్రజా ప్రతినిధిగానే కాకుండా డాక్టర్ గా వారి ఆరోగ్య వివరాలు తెలుసుకొని ఆరోగ్యానికి సంబంధించిన సూచనలు చేయడం జరిగింది. గత సత్తుపల్లి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నేరుగా ఎమ్మెల్యే గారే ఇంటికి వచ్చి చెక్కులు ఇవ్వటం పట్ల ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నట్లు లబ్ధిదారులు గ్రామ నాయకులు తెలిపారు. ఇంత మంచి మనసున్న ఎమ్మెల్యే మాకు దొరకటం నిజంగా సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలు చేసుకున్న అదృష్టమని వారి ఆనందాన్ని ప్రజల వ్యక్తపరుస్తున్నారు. ఈ కార్యక్రమం లో కల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బాగం నీరజ ప్రభాకర్ చౌదరి మరియు కల్లూరు మండలం, కల్లూరు పట్టణం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా, యూత్, ఎన్ ఎస్ యు ఐ నాయకులు పాల్గొన్నారు.

## యువజన కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం

**-యువతే భవిష్యత్తు అన్న ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి**

నాగర్‌కర్నూల్, ప్రజా స్వేచ్ఛ...
నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని తీగల వెంకటస్వామి కన్వెన్షన్ హాల్‌లో యువజన కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డా. కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి డిసిసి అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ, ఎమ్మెల్సీ కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో నియోజకవర్గ, మండల



స్థాయి యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుతూ, “యువతలోనే రాష్ట్ర భవిష్యత్తు దాగుంది. ప్రజల సమస్యలపై పోరాడే ధైర్యం, సమాజానికి సేవ చేయాలనే తపన యూత్ కాంగ్రెస్ కార్యకర్తల్లో కనిపిస్తోంది” అని అన్నారు. యువతకు నాయకత్వ అవకాశాలు కల్పిస్తూ, పార్టీ భావజాలాన్ని ముందుకు తీసుకెళ్లే వారిని ప్రోత్సహించడంలో తన పూర్తి సహకారం ఉంటుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. యువ నేతల కృషిని ప్రశంసించారు కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, మండల అధ్యక్షుడు కోటయ్య, అసెంబ్లీ అధ్యక్షులు తిరుపతి గౌడ్, మాజీ ఎంపీపీ ప్రతాప్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు, కొడిదల రాము, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## లాభాల స్వీకరణకు దిగిన మదుపరులు.. నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..



దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం నష్టాల్లో ముగిశాయి. ఉదయం నుంచి మార్కెట్లు లాభాల్లో ట్రేడయినా.. చివరి వరకు కొనసాగించలేకపోయాయి. మదుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో మార్కెట్లు చివరి సెషన్‌లో నష్టాల్లోకి జారుకున్నాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 83,540.74 పాయింట్ల వద్ద నష్టాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 83,850.09 గరిష్టానికి పెరిగిన సెన్సెక్స్.. 83,850.09 పాయింట్ల కనిష్టానికి చేరింది. చివరకు 170.22 పాయింట్లు పతనమై.. 83,239.47 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 48.10 పాయింట్లు తగ్గి 25,405.30 వద్ద ముగిసింది. అమెరికా, వియత్నాం వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో ప్రపంచ మార్కెట్‌లో సానుకూల పవనాలతో భారత మార్కెట్లు సైతం లాభాల్లో మొదలయ్యాయి.తొలి అర్ధభాగంలో నిఫ్టీ 25,600 పాయింట్లకు చేరింది. అయితే, చివరి గంటలో మదుపరుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో ఇంట్రాడేలో వచ్చిన లాభాలన్నీ ఆవిరయ్యాయి. అపోలో హాస్పిటల్స్, హీరో మోటోకార్ప్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, ఓఎన్‌జీసీ, మారుతి సుజుకీ నిఫ్టీలో ప్రధాన లాభాలను ఆర్జించాయి. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్ నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే మెటల్, రియాల్టీ, పీఎస్‌యూ బ్యాంక్, టెలికాం సూచీలు ఒక్కొక్కటి 0.5 శాతం క్షీణించాయి. ఫార్మా, మీడియా, ఆయిల్ అండ్ గ్యాస్, ఆటో, కన్స్యూమర్ డ్యూరబుల్ 0.3-1 శాతం పెరిగాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్‌తో కలిపి విస్తృత సూచీలు వరుసగా మూడో సెషన్‌లో క్షీణించాయి. స్మాల్‌క్యాప్ ఇండెక్స్ రెండురోజుల పతనాన్ని అధిగమించి 0.5 శాతం పెరిగాయి. బీఎస్‌ఈలో 140కి పైగా స్టాక్‌లు 52 వారాల గరిష్ట స్థాయికి చేరాయి.

## సరికొత్త ఐక్యూబ్.. సింగిల్ చార్జింగ్‌తో 123 కిమీ

### ధర రూ.1.03 లక్షలు..



చెన్నై,
ప్రముఖ వాహన సంస్థ టీవీఎస్ మోటర్..మార్కెట్లోకి సరికొత్త ఐక్యూబ్ ఈ-స్కూటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. మెరుగైన ఫీచర్స్‌తో తీర్చిదిద్దిన ఈ మాడల్ ధరను రూ.1.03 లక్షలుగా నిర్ణయించింది. హిల్ హెూల్డ్ అసిస్ట్, 3.1 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన ఈ మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 123 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది.ఇప్పటికే ఐక్యూబ్ మాడల్ 6 లక్షల యూనిట్లకు పైగా అమ్ముడయ్యాయి. ఈ కొత్త వేరియంట్ ప్రతిరోజు ప్రయాణించడానికి అనుకూలంగా రూపొందించింది. డ్యూయల్ టోన్ కలర్స్, బ్యాక్‌రెస్ట్, బ్యాటరీ కెపాసిటీని అప్‌గ్రేడ్ చేసి ఈ మాడల్‌ను అభివృద్ధి చేసినట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

## మళ్లీ భారీగా పెరిగిన గోల్డ్ రేట్.. తులం ఎంతకు పలుకుతుందంటే..?

దేశంలో బంగారం ధర భారీగా పెరిగింది. ఆషాఢ మాసం పండుగల సీజన్, శ్రావణ మాసం పెళ్లిల కోసం బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి షాకిస్తూ పసిడి పరుగులు పెడుతోంది. జూన్ నెలాఖరున వరుసగా 7-8 రోజులుగా తగ్గిన గోల్డ్ ధర ఇప్పుడు వరుసగా పెరుగుతోంది. జూలై మొదటి రోజునుండి బంగారం ధర భారీగా పెరుగుతూ వస్తోంది. ఈరోజు కూడా గోల్డ్ రేట్ పెరిగింది. ప్రముఖ నగరాలు, పట్టణాల్లో ఇవాళ్టి బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో ఇక్కడ చూద్దాం..



-ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.99,050, 22 క్యారెట్ల ధర రూ.90,810 లుగా ఉంది. కిలో వెండి ధర రూ.1,09,900 లుగా ఉంది.

- ముంబైలో 24 క్యారెట్ల ధర రూ.98,900, 22 క్యారెట్ల ధర రూ.90,660 ఉంది. వెండి ధర కిలో రూ.1,09,900 గా ఉంది

- చెన్నైలో 24 క్యారెట్ల ధర రూ.98,900 లు ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.90,660 గా ఉంది. వెండి ధర కిలో రూ.1,20,100 లుగా ఉంది.

- బెంగళూరులో 24 క్యారెట్ల ధర రూ.98,900, 22 క్యారెట్ల ధర రూ.90,660 గా ఉంది. వెండి ధర కిలో రూ.1,19,900 లుగా ఉంది.

- హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.98,900 ఉండగా.. 22 క్యారెట్ల గోల్డ్ ధర రూ.90,660 లుగా ఉంది. కిలో వెండి ధర రూ.1,19,900 గా ఉంది.

- విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.98,900, 22 క్యారెట్ల ధర రూ.90,660లుగా ఉంది. వెండి కిలో ధర రూ.1,19,900 లుగా ఉంది.

## ఆగస్టులో ఆసియా కప్.. భారత్‌కు రానున్న పాకిస్థాన్ జట్టు..!



భారత్, పాకిస్థాన్‌ల మధ్య క్రీడా సంబంధాలపై అనిశ్చితి కొనసాగుతోంది. ఆపరేషన్ సిందూర్ తర్వాత ఇరు దేశాల బోర్డులు అంతర్జాతీయ టోర్నీల్లోనే ఒకే గ్రూప్‌లో ఆడేందుకు నిరాకరించడమే అందుకు కారణం. ఈ క్రమంలోనే భారత్ ఈ ఏడాది ఆతిథ్యమిస్తున్న హాకీ ఆసియా కప్ లో పాక్ ఆడడంపై సందేహాలు నెలకొన్నాయి. అయితే.. ఆ దేశ క్రీడా శాఖ మంత్రిత్వ శాఖ మాత్రం తమ జట్టును ఇండియాకు పంపించేందుకు సిద్ధమవుతోంది.హాకీ ఆసియా కప్ టోర్నీ భారత్ వేదికగా ఆగస్ట్ 27న ప్రారంభం కానుంది. సెప్టెంబర్ 27 వరకూ జరుగబోయే ఈ ఈవెంట్‌కు హాకీ ఇండియా సన్నాహకాలు చేస్తోంది. టోర్నమెంట్ సమీపిస్తున్న వేళ గురువారం పాకిస్థాన్ క్రీడా మంత్రిత్వ శాఖ భారత్‌కు తమ జట్టును పంపేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పింది. 'భారత్ వేదికగా జరుగబోయే పలు దేశాల టోర్నీలో మేము ఏ జట్టుకు వ్యతిరేకం కాదు. ఇదేమీ ద్వైపాక్షికి సిరీస్ కాదు. అంతర్జాతీయ క్రీడా నిబంధనలు మాకు తెలుసుఅందుకే మా జట్టును పోటీలకు పంపేందుకు అడ్డు చెప్పం. రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం జరుగుతున్నా సరే ఆ దేశాల జట్లు పలు వేదికలపై పోటీ పడ్డాయి. కాబట్టి.. పాక్ జట్టుకు ఆసియా కప్ ఆడేందుకు అనుమతిస్తున్నాం' అని పాక్ క్రీడా శాఖ సన్నిహిత వర్గాలు తెలిపాయి. అయితే.. సెప్టెంబర్‌లో టీ20 ఫార్మాట్‌లో జరుగబోయే ఆసియా కప్‌లో దాయాదులు తలపడుతాయా? అనే విషయంపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ఈ విషయంపై బీసీసీఐ అభిప్రాయం వెలిబుచ్చాకే తమ మాట చెప్పాలని క్రీడా మంత్రిత్వ శాఖ భావిస్తున్నట్టు సమాచారం.

## రెండో రోజు భారత్‌దే పైచేయి.. మిడిలార్డర్‌పైనే ఇంగ్లండ్ ఆశలన్నీ..!





ఎడ్జ్‌బాస్టన్ టెస్టులో భారత పట్టు బిగిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్(269) డబుల్ సెంచరీతో భారీ స్కోర్ చేసిన టీమిండియా అనంతరం ఇంగ్లండ్ మూడు వికెట్లు తీసింది. ఓపెనర్ డకెట్, ఓలీ పోప్‌ను డకౌట్ చేసిన ఆకాశ్ దీప్(2-36) ఆతిథ్య జట్టును దెబ్బ కొట్టగా.. సిరాజ్ సైతం విజృంభించి డేంజరస్ జాక్ క్రాలే(19)ను వెనక్కి పంపాడు. టాపార్డర్ వైఫల్యంతో కష్టాల్లో పడిన జట్టను జో రూట్(18 నాటౌట్), హ్యారీ బ్రూక్(30 నాటౌట్) ఆదుకున్నారు. ఆఖరి నలభై నిమిషాలు వికెట్ కాపాడుకున్న ఈ జోడీ రన్స్ రాబట్టింది. దాంతో, రెండో రోజు ఆట ముగిసే సరికి స్టోక్స్ సేన 3 వికెట్ల నష్టానికి 77 పరుగులు చేసింది. ఇంకా తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 510 రన్స్ వెనకబడి ఉంది.ఎడ్జ్‌బాస్టన్‌లో తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లండ్‌కు బిగ్ షాక్. భారత పేసర్ ఆకాశ్ దీప్ (2-12) నిప్పులు చెరగడంతో ఆ జట్టు రెండు కీలక వికెట్లు కోల్పోయింది. ఆకాశ్ ఒకే ఓవర్లో తొలుత బెన్ డకెట్(0)ను ఔట్ చేసి ఇండియాకు బ్రేకిచ్చాడు. ఆ తర్వాత బంతికే తొలి టెస్టు సెంచరీ వీరుడు ఓలీ పోప్(0)ను గోల్డెన్ డక్‌గా పెవిలియన్ చేరాడు. రాహుల్ క్యాచ్ అందుకోవడంతో.. 13 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది ఆతిథ్య జట్టు.

# స్పోర్ట్స్

## డబుల్ సెంచరీతో చరిత్ర సృష్టించిన గిల్..

### తొలి భారతీయుడు అతడే..!




భారత జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్(205నాటౌట్) ఎడ్జ్‌బాస్టన్ టెస్టులో డబుల్ సెంచరీ సాధించాడు. లంచ్ బ్రేక్ తర్వాత జోరు పెంచిన అతడు జోష్ టంగ్ ఓవర్లో సింగిల్ తీసి ద్విశతకం పూర్తి చేసుకున్నాడు. గాల్లోకి పంచ్‌లు విసురుతూ సంబురాలు చేసుకున్నాడు. అంతుకుందు టంగ్ ఓవర్లో కవర్ డ్రైవ్‌తో ఫోర్ బాదిన గిల్ 190కి చేరువైన గిల్.. అనంతరం మూడో బంతిని డీప్ స్క్వేర్ లెగ్‌లో ఫోర్ రాబట్టాడు. ఆ తర్వాత వాషింగ్టన్ సుందర్(22 నాటౌట్) కు ఛాన్సిచ్చిన అతడు టంగ్ ఓవర్లోనే సింగిల్‌తో కెరియర్లో తొలి డబుల్ కలను సాకారం చేసుకున్నాడు.ఇంగ్లండ్ పర్యటనలో దంచికొడుతున్న గిల్ చిన్నవయసులోనే ద్విశతకం బాదిన భారత మూడో కెప్టెన్‌గా ఘనత సొంతం చేసుకున్నాడు. గిల్ 23 ఏళ్ల 298 రోజుల్లో ఈమైలురాయికి చేరుకున్నాడు. మాస్టర్ బ్లాస్టర్ సచిన్, విరాట్ కోహ్లీలను అతడి వెనకే ఉండడం విశేషం. 23 ఏళ్ల 398రోజుల్లోనే డబుల్ సెంచరీ కొట్టేసిన మన్సూర్ అలీ ఖాన్ పటౌడీ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.సచిన్ 26 ఏళ్ల 189 రోజుల్లో, కోహ్లీ 27 ఏళ్ల 260 రోజుల్లో డబల్ క్లబ్‌లో చేరారు. మొత్తంగా ఇంగ్లండ్ నేలపై ద్విశతకం బాదిన తొలి భారత కెప్టెన్‌గా గిల్ రికార్డు సృష్టించాడు. అజారుద్దీన్ 179 పరుగులతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు.మొత్తంగా విదేశీ గడ్డపై రెండొందలు బాదిన ఆరో సారథిగా మరో మైలురాయికి చేరువయ్యాడీ యంగ్‌స్టర్. అతడి కంటే ముందు విరాట్ కోహ్లీ, మన్సూర్ అలీ ఖాన్ పటౌడీ, సచిన్ టెండూల్కర్, ఎంఎస్ ధోనీ ఈ ఘనత సాధించారు.








## 'హరిహర వీరమల్లు' ట్రైలర్ వచ్చేసింది

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న పాన్-ఇండియన్ చిత్రం 'హరి హర వీర మల్లు: పార్ట్ 1-స్వోర్డ్ వర్సెస్ స్పిరిట్' పై భారీ అంచనాలు నెలకొన్న విషయం తెలిసిందే. జూలై 24, 2025న వరల్డ్ వైడ్‌గా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు.హిందువుగా జీవించాలంటే పన్ను కట్టాల్సిన సమయం. ఈ దేశ శ్రమ బాద్‌షా పాదాల కింద నలిగిపోతున్న సమయం. ఒక వీరుడు కోసం పకృతి పురుడు పోసుకుంటున్న సమయం. అన్న డైలాగ్స్‌తో ఈ ట్రైలర్ మొదలవుతుంది. ట్రైలర్ చూస్తుంటే.. 17వ శతాబ్దపు మొఘల్ సామ్రాజ్యం ఔరంగజేబు కాలం నేపథ్యంలో తెరకెక్కిన సినిమాల కనిపిస్తుంది. పవన్ కళ్యాణ్ ఇందులో వీరమల్లు అనే యోధుడి పాత్రలో కనిపించబోతున్నాడు. ఈ చిత్రంలో నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తుండగా, బాబీ డియోల్, నాజర్, నార్గిస్ ఫఖ్రీ, అనుపమ్ ఖేర్, సుబ్బరాజు, సునీల్, విక్రమ్‌జీత్ విర్క్, నోరా ఫతేహి తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాకు జ్యోతి కృష్ణతో పాటు క్రిష్ జగర్లమూడి దర్శకత్వం వహించారు. ఎ. దయాకర్ రావు నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఎం.ఎం. కీరవాణి సంగీతం అందించగా, మనోజ్ పరమహంస సినిమాటోగ్రఫీ, తోట తరణి ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరించారు. ఎ.ఎం. రత్నం ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు.

## ఓటీటీలో దూసుకుపోతున్న సూపర్‌నేచురల్ థ్రిల్లర్ విరాటపాలెం

ప్రముఖ ఓటీటీ సంస్థ జీ5 తాజాగా తెలుగు ఒరిజినల్ సిరీస్ 'విరాటపాలెం: PC మీనా రిపోర్టింగ్'తో మళ్ళీ అందరినీ ఆకట్టుకుంది. ఓటీటీలోకి వచ్చిన రెండు,మూడు రోజుల్లోనే 50 మిలియన్ స్ట్రీమింగ్ మినిట్స్‌ను క్రాస్ చూసి దూసుకుపోతోంది. ఈ సూపర్‌నేచురల్ థ్రిల్లర్ సిరీస్ ఆడియెన్స్‌ను తెగ ఆకట్టుకుంటోంది. ఇక ఈ భారీ విజయం తరువాత జీ5 సంస్థ మరో క్రేజీ చిత్రానికి సంబంధించిన అప్డేట్ ఇచ్చారు. రీసెంట్ బ్లాక్ బస్టర్ మూవీ 'భైరవం' త్వరలోనే జీ5లోకి రాబోతోందని ప్రకటించారు.ప్రస్తుతం జీ5 లో 'విరాటపాలెం' సిరీస్ టాప్‌లో ట్రెండ్ అవుతోంది. కెవి శ్రీరామ్ నిర్మించిన ఈ సిరీస్‌ను కృష్ణ పోలూరు డైరెక్ట్ చేశారు. అభిజ్ఞ వూతలూరు, చరణ్ లక్కరాజు ప్రముఖ పాత్రలు పోషించారు. 1980లలో ఆంధ్రప్రదేశ్‌లోని విరాటపాలెం అనే గ్రామంలో ప్రతి వధువు తన పెళ్లి రోజున చనిపోతుంటుంది. అదొక శాపం అని గ్రామస్థులు భయంతో వణికిపోతుంటారు. అలా దాదాపు ఓ పదేళ్ల పాటుగా గ్రామంలో వివాహం అనేది జరగదు. భయం, మూఢనమ్మకాల మధ్య కొట్టుమిట్టాడుతూ ఉండే ఆ ఊర్లోకి పోలీసు కానిస్టేబుల్ మీనా (అభిజ్ఞ వూతలూరు) వస్తుంది. శాపగ్రస్తమైన గ్రామంలోకి ప్రవేశించి అక్కడి ప్రజల్ని ప్రశ్నించడానికి ధైర్యం చేస్తుంది. ఆ ఊరి రహస్యాల్ని ఎలా తెలుసుకుంది? అది శాపమా? ఎవరైనా చేస్తున్న హత్యలా? అనే ఉత్కంఠ, థ్రిల్స్ కలిగించే అంశాలతో సిరీస్ సాగుతుంది.జూన్ 26న ప్రీమియర్ అయిన విరాటపాలెం: PC మీనా రిపోర్టింగ్ ప్రశంసలు అందుకుంటోంది. ఒరిజినల్ కంటెంట్, నాణ్యమైన షోలను అందించే జీ5 నిబద్ధతను చాటడంలో ఈ సిరీస్ ఓ ఉదాహరణ అని చెప్పుకోవచ్చు. ప్రత్యేకంగా జీ5 లో 'విరాటపాలెం:PC మీనా రిపోర్టింగ్' స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సినిమాను అస్సలు మిస్ అవ్వకండి.



## రాముడిగా రణ్‌బీర్ కపూర్.. 'రామాయణ' ఫస్ట్ గ్లింప్స్ వచ్చేసింది

సాయిపల్లవి, బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'రామాయణ,. ఈ సినిమాకు దంగల్ సినిమా దర్శకుడు నితేశ్ తివారీ దర్శకత్వం వహిస్తుండగా.. నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్నాడు. రణ్‌బీర్ కపూర్ రాముడి పాత్రలో నటిస్తుండగా.. సాయి పల్లవి సీత పాత్రను పోషిస్తుంది. కన్నడ స్టార్ నటుడు యష్ రావణుడి పాత్రలో నటించబోతున్నాడు. రెండు పార్టులుగా రాబోతున్న ఈ సినిమా నుంచి మేకర్స్ తాజాగా ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు.ముల్లోకాలను త్రిమూర్తులు (బ్రహ్మ, విష్ణువు, శివుడు) పరిపాలిస్తున్నారు. బ్రహ్మ అందరిని సృష్టిస్తే.. విష్ణువు రక్షిస్తాడు. శివుడు అంతం చేయగలిగే వాడు. అయితే, వారు సృష్టించిన ఈ మూడు లోకాలపై ఆధిపత్యం కోసం వారు ఎదురు తిరిగినప్పుడు, అన్ని యుద్ధాలను అంతం చేసే ఒక మహాయుద్ధం మొదలైంది. 5 వేల సంవత్సరాలుగా, 2500 కోట్ల మంది ప్రజలు ఆరాధించేది ఇదే. రామాయణం మన వాస్తవం, మన చరిత్ర అంటూ గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్. హనుమంతుడి పాత్రలో సన్నీ డియోల్, కైకేయి పాత్రలో లారా దత్తా నటిస్తుండగా.. లక్ష్మణుడి పాత్రలో రవి దూబే నటించబోతున్నాడు.

## మళ్లీ లాక్ డౌన్ పడితే.. ఆ హీరో ఫ్యామిలితో కలిసుంటా..!

### కీర్తిసురేష్ ఆసక్తికర కామెంట్స్

నేను శైలజ సినిమాతో టాలీవుడ్ ప్రేక్షకులకు పరిచయం అయ్యింది అందాల భామ కీర్తిసురేష్. తొలి సినిమాతోనే మంచి హిట్ అందుకున్న కీర్తిసురేష్ ఆతర్వాత మహానటి సినిమాతో మంచి విజయాన్ని అందుకుంది. మహానటి సినిమాతో ఏకంగా నేషనల్ అవార్డు అందుకుంది. ఇక ఇప్పుడు తెలుగు, తమిళ్ భాషల్లో సినిమాలు చేస్తూ బిజీగా ఉంది. తెలుగులో చివరగా మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న భోళాశంకర్ సినిమాలో చిరు చెల్లెలిగా కనిపించింది. అలాగే నాని నటిస్తున్న దసరా సినిమాలో హీరోయిన్ గా నటించింది. ఇటీవలే బాలీవుడ్ లోకి కూడా అడుగుపెట్టింది. కానీ అక్కడ మొదటి సినిమాతోనే ఫ్లాప్ అందుకుంది.. ఇప్పుడు వరుస సినిమాలు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది ఈ చిన్నది.స్టార్ హీరోల సినిమాల్లో హీరోయిన్ గా నటిస్తూనే.. లేడీ ఓరియెంటెడ్ సినిమాల్లోనూ నటించి మెప్పిస్తుంది. ప్రస్తుతం కీర్తిసురేష్ ఉప్పు కప్పురంబు అనే సినిమాలో నటిస్తుంది. ఈ సినిమాలో సుహాస్ ప్రధాన పాత్రలో నటిస్తున్నాడు. ఈ సినిమా డైరెక్ట్ గా ఓటీటీలో విడుదలకానుంది. ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ లో ఈ సినిమా విడుదలకానుంది. ఈ సినిమా ప్రమోషన్స్ లో కీర్తిసురేష్ చురుగ్గా పాల్గొంటుంది. ఈ క్రమంలోనే తాజాగా సుమతో జరిగిన ఇంటర్వ్యూలో కీర్తిసురేష్ ఆసక్తికర కామెంట్స్ చేసింది.ఒకవేళ మళ్లీ లాక్ డౌన్ పడితే ఏ హీరోతో ఉండటానికి ఇష్టపడతారు అంటూ సుమ అడిగిన ప్రశ్నకు.. కీర్తిసురేష్ ఆలోచించకుండా నాని పేరు చెప్పింది. నాని, ఆయన సతీమణి అంజు అలాగే నాని కొడుకు అర్జున్ తో కలిసి ఉండటానికి ఇష్టపడతాని అని తెలిపింది. ఈ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.



## సైలెంట్‌గా ఓటీటీలోకి వచ్చిన కమల్ బిగ్గెస్ట్ డిజాస్టర్..




యూనివర్సల్ హీరో కమల్ హాసన్, లెజెండరీ దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో తెరకెక్కిన భారీ చిత్రం "థగ్ లైఫ్". త్రిష కథానాయికగా, నటుడు శింబు కీలక పాత్రలో నటించిన ఈ చిత్రం భారీ అంచనాల నడుమ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ చిత్రంకి థియేటర్లలో మాత్రం ఆశించిన స్పందన రాకపోవడంతో మొదటి రోజు నుంచే ఫ్లాప్ టాక్‌ను ఎదుర్కొంది. దీనితో ఈ సినిమా త్వరగా ఓటీటీకి వస్తుందని వార్తలు గుప్పుమన్నాయి. ఇప్పుడు అవి నిజమయ్యాయి. "థగ్ లైఫ్" చిత్రాన్ని నెట్‌ఫ్లిక్స్ ఓటిటీలో ముందుగానే విడుదల చేసింది. మొదట హిందీ వెర్షన్ ఆలస్యంగా రానుందని వార్తలు రాగా, అదే సమయంలో తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ ప్రారంభమైంది.ఈ సినిమా డిజిటల్ రైట్స్‌ని రిలీజ్‌కి ముందే భారీ ధరకి కొనుగోలు చేసింది నెట్‌ఫ్లిక్స్. సినిమాని థియేటర్స్‌లో విడుదలైన ఎనిమిది వారాలకి స్ట్రీమింగ్ చేసేలా డీల్ మాట్లాడుకున్నారు. కాని ఇప్పుడు చిత్రానికి నెగెటివ్ టాక్ రావడంతో నాలుగువారాలలోనే స్ట్రీమ్ చేస్తున్నారు. తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం, హిందీ ఇలా అన్ని భాషలలో ఇప్పుడు థగ్ లైఫ్ చిత్రం స్ట్రీమింగ్ అవుతుంది. కర్ణాటకలో ఈ చిత్రం బ్యాన్ కాగా, అక్కడి అభిమానులు మూవీని చూడలేకపోయారు. ఓటీటీ ద్వారా వారికి చూసే అవకాశం ఇప్పుడు దక్కింది.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492